# వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా..

సంపుటి : 2 | సంచిక : 246 | సోమవారం 18 మార్చి 2024 | పేజీలు : 8 | వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri



విలేకరులు కావలెను

http://vaasthavanestham.com

వాస్తవ నేస్తం
తెలుగు దిన పత్రిక
ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...

సంప్రదించండి
తెలంగాణ 8099779988
ఆంధ్రప్రదేశ్ 9985337979

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో

వాస్తవ నేస్తం దిన పత్రికలో పనిచేయుటకు ఉత్సాహవంతులైన

- జిల్లా బ్యూరో చీఫ్‌లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు
- నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు
- మండల రిపోర్టర్లు కావలెను




## పదేళ్లలో తెలంగాణ ఇబ్బందులకు గురైంది

- అబద్ధాలతో తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్
- పోరాటాలతో వచ్చిన తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బలి అయ్యింది
- ధర్నా చౌక్‌ను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం బ్యాన్ చేసింది
- కాంగ్రెస్ డిక్లరేషన్‌ల పేరుతో ప్రకటనలు చేయించారు
- కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలకు అమలు చేయడం లేదు
- కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

హైదరాబాద్:

అబద్ధాలతో కాంగ్రెస్ తెలంగాణలో అధికారంలోకి వచ్చిందని కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం నాడు బీజేపీ కార్యాలయంలో ప్రశ్నిస్తున్న తెలంగాణ వెబ్ సైట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా -మిగతా3లో

## ఆ రెండు పార్టీలకు చుక్కలే..



- ఇక నుంచి నా రాజకీయం ఏంటో చూపిస్తా..!
- ఇన్ని రోజులు సీఎంగా నిబద్ధతతో పనిచేశా..
- ఇక రాజకీయం చూపిస్తా: సీఎం రేవంత్
- 'మా ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తైంది
- కేసీఆర్ కుటుంబం పతనమైంది..
- లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది
- నిన్నటిదాకా సీఎంగా నిబద్ధతతో పనిచేశా
- ఇక పార్టీ అధ్యక్షునిగా నన్ను చూస్తారు.
- కలుపు మొక్కలను ఏరిపారేస్తున్నాం..

హైదరాబాద్


తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలకు నగారా మోగిందని.. ఇప్పటి నుంచి తన రాజకీయం ఏంటో బీఆర్ఎస్ బీజేపీ పార్టీలకు చూపిస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు 100 రోజులు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో ఆదివారం నాడు జరిగిన "మీట్ ది ప్రెస్" కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. నిజాం ఎన్ని అభివృద్ధి పనులు చేసినా.. నిరంకుశత్వాన్ని ప్రయోగించారని అన్నారు. ఖాసిం రజ్వీ తెలంగాణలో తన ఆధిపత్యం, అధికారంపై తిరుగుబాటు చేసిన వారిని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అణిచివేసే ప్రయత్నం -మిగతా3లో




## ఆ రెండు రాష్ట్రాల కౌంటింగ్ తేదీల్లో మార్పు

- అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల ఎన్నికల సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం
- అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కంటే రెండు రోజుల ముందే జూన్ 2వ తేదీన చేపట్టనున్న ఈసీ వెల్లడి

## బీఆర్ఎస్‌కు షాక్



- కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎంపీ, ఎమ్మెల్యే
- సికింద్రాబాద్ ఎంపీ టికెట్‌ను దానం నాగేందర్‌కు కాంగ్రెస్ ఖరారు
- బీఆర్ఎస్‌ను ఖాళీ చేయడమే టార్గెట్‌గా కాంగ్రెస్ పావులు
- చేవెళ్ల పార్లమెంట్ నుంచి రంజిత్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పట్నం సునీతా రెడ్డిని బరిలో దింపాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు సమాచారం
- కాంగ్రెస్‌లో చేరిన రంజిత్‌రెడ్డి, నాగేందర్

హైదరాబాద్

బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీలోకి చేరారు. సికింద్రాబాద్ ఎంపీ టికెట్‌ను దానం నాగేందర్‌కు కాంగ్రెస్ ఖరారు చేసింది. కాగా, బీఆర్ఎస్‌ను ఖాళీ చేయడమే టార్గెట్‌గా కాంగ్రెస్ పావులు కదుపుతోంది. బీఆర్ఎస్‌కి చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ గుడ్ బై చెప్పారు. ఇటీవల రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్యే లు ప్రకాష్ గౌడ్, యాదయ్య కలిశారు. అలాగే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మల్కాజిగిరి, మేడ్చల్ ఎమ్మెల్యేలు రాజశేఖర్ రెడ్డి, మల్లారెడ్డి ఇటీవల కలిసిన సంగతి తెలిసిందే. చేవెళ్ల పార్లమెంట్ నుంచి రంజిత్ రెడ్డి, మల్కాజిగిరి పార్లమెంట్ నుంచి పట్నం సునీతా రెడ్డిని బరిలో దింపాలని కాంగ్రెస్ యోచిస్తున్నట్లు సమాచారం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఓ వైపు ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో కుమార్తె కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయగా.. మరోవైపు పార్టీలో సీనియర్ -మిగతా3లో



## కవిత అరెస్ట్ చట్టబద్ధమే

- కోర్టు ఉత్తర్వుల్లో సంచలన విషయాలు
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఏడు రోజులు కస్టడీ విధించిన సెషన్స్ కోర్టు
- కవితను అరెస్టు చేయవద్దని ఎక్కడా సుప్రీంకోర్టు లిఖిత పూర్వక ఆదేశాలు ఇవ్వలేదు
- తదుపరి విచారణ వరకు మాత్రమే సమన్లు ఇవ్వమని ఈడీ సుప్రీంకోర్టుకు చెప్పింది
- ఆ తర్వాత రెండుసార్లు ఈడీ సమన్లు ఇచ్చినప్పటికీ కవిత సుప్రీంకోర్టులో వాటిని ఛాలెంజ్ చేయలేదు

ఢిల్లీ

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సెషన్స్ కోర్టు ఏడు రోజులు కస్టడీ విధించింది. ఈ నేపథ్యంలో కస్టడీకి సంబంధించి కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో సంచలన విషయాలను వెల్లడించింది. కవిత అరెస్ట్ చట్టబద్ధమే అని కోర్టు పేర్కొంది. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. అనంతరం, ఢిల్లీలోరి రౌస్ అవెన్యూ కోర్టులో కవితను -మిగతా3లో

## ఎమ్మెల్సీ కవితతో కేటీఆర్, హరీష్ రావు భేటీ



- కవితకు ధైర్యం చెప్పిన అనిల్, కేటీఆర్, హరీశ్
- ఢిల్లీలో ఈడీ కస్టడీలో ఉన్న కవిత
- ఈడీ కార్యాలయంలో కవితను కలిసిన కుటుంబ సభ్యులు
- న్యాయ పోరాటం చేద్దామని ధైర్యం చెప్పిన వైనం

న్యూఢిల్లీ


ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఈడీ కస్టడీలో ఉన్న సంగతి తెలిసిందే. ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఆమెను వారం రోజుల పాటు ఈడీ కస్టడీకి అనుమతించింది. ఈ నెల 23 వరకు కవితను విచారించేందుకు ఈడీకి అనుమతిని ఇచ్చింది. మరోవైపు కాసేపటి క్రితం కవితను ఢిల్లీలోని ఈడీ కార్యాలయంలో ఆమె భర్త అనిల్, సోదరుడు కేటీఆర్, బావ హరీశ్ రావు కలిశారు. కవిత యోగ, క్షేమాలను వీరు కనుక్కున్నారు. ఈ కేసులో న్యాయపోరాటం చేద్దామని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా న్యాయవాది మోహిత్ రావు కూడా కవితను కలిశారు. ప్రతిరోజు కవితను కుటుంబ సభ్యులు, ఆమె న్యాయవాదులు కలుసుకునే -మిగతా3లో

# ఎలక్టోరల్ బాండ్ల కొత్త డేటా విడుదల

**ఢిల్లీ:** ఎలక్టోరల్ బాండ్లపై కేంద్ర ఎన్నికల సంఘం రెండో జాబితాను అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సమర్పించిన డేటాను మరోసారి అందుబాటులో ఉంచినట్లు ఆదివారం ఎన్నికల సంఘం వెల్లడించింది. సీల్డ్ కవరులో కోర్టుకు ఇచ్చిన వివరాలు కూడా ఇందులో ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీ పార్టీ అత్యధికంగా రూ.6,986.50 కోట్ల విరాళాలను పొందినట్లు తెలిపింది. కేవలం 2019-2020 మధ్య బీజేపీకి రూ.2,555 కోట్ల బాండ్లు అందినట్లు ఈసీ విడుదల చేసిన డేటా వెల్లడిస్తోంది. ఇక.. బీజేపీ పార్టీ తర్వాత అత్యధికంగా బెంగాల్ సీఎం మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణముల్ కాంగ్రెస్ పార్టీ (టీఎంసీ)కి రూ.1,397కోట్ల విలువైన బాండ్లను విరాళాలుగా పొందినట్లు తెలిపింది.

**ఈసీ వెల్లడించిన డేటా ప్రకారం.. ఆయా పార్టీకు వచ్చిన విరాళాలు**

- కాంగ్రెస్ పార్టీ- రూ.1334 కోట్లు
- బీఆర్ఎస్- రూ. 1322 కోట్లు
- బిజు జనతాదళ్- రూ.944 కోట్లు
- డీఎంకే - రూ. 656.5 కోట్లు (ఇందులో రూ. 509 కోట్లు లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ నుంచి వచ్చాయి)
- వైఎస్సార్‌సీపీ- రూ.442.8 కోట్లు
- టీడీపీ- రూ.182. 35 కోట్లు
- సమాజ్‌వాదీ పార్టీ- రూ. 14.5 కోట్లు




- అకాలీదళ్- రూ.7.26 కోట్లు
- ఏఐఏడీఎంకే- రూ.6.05 కోట్లు
- నేషనల్ కాన్ఫరెన్స్- రూ. 50 లక్షలు

ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించి మొదటి జాబితాను విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే ఎన్నికల సంఘానికి ఇచ్చిన సమాచారంలో ఎస్‌బీఐ పూర్తి సమాచారం ఇవ్వలేదని సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలక్టోరల్ బాండ్ల నంబర్లు ఎందుకు లేవో చెప్పాలని మార్చి 15 నోటీసులు జారీ చేసింది. తమ ఆదేశాల ప్రకారం బాండ్ల పూర్తి వివరాలు వెల్లడించకపోవటంపై ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు జడ్జిల రాజ్యాంగ ధర్మాసనం ఎస్‌బీఐపై ఆగ్రహం వ్యక్తం చేసింది.

## ఒకే డ్రెస్ ఎన్ని రోజులేసుకుంటాం.. ఎంపీ ఆసక్తికర వ్యాఖ్యలు



కేంద్ర ఎన్నికల సంఘం లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల తేదీలను ప్రకటించింది. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగరికా ఘోష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రానున్న ఎన్నికలను సత్యం గెలిచే తరుణంగా ఆమె అభివర్ణించారు. 'ఈ ఎన్నికలు ఎందుకు అవసరం? ఈ ఎన్నికలు మనకు సత్యాన్ని గెలిపించే క్షణాలు. ఒక పార్టీకి, ఒక నాయకుడికి, ఒకే భాషకు, ఒకే మతానికి, ఒకే దుస్తులకు కట్టుబడి ఉందామా? లేదా మన సమాఖ్య, భిన్న విశ్వాసాలు, బహుళ సాంస్కృతిక వైవిధ్యమైన ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామా?" అని ఆమె ప్రజలను ప్రశ్నించారు. "మన ప్రాథమిక స్వేచ్ఛకు ముప్పు ఉన్న కాలంలోనే జీవించాలనుకుంటున్నారా? గుర్తుంచుకోండి.. తెలివిగా ఓటు వేయండి" అంటూ ఆమె ఓటర్లకు పిలుపునిచ్చారు. కాగా, దేశవ్యాప్తంగా 543 లోక్‌సభ స్థానాలకు సార్వత్రిక ఎన్నికలు ఏప్రిల్ 19 నుంచి ఏడు దశల్లో జరుగుతాయని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జూన్ 4న కౌంటింగ్ నిర్వహించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని మొత్తం 42 స్థానాల్లో ఏప్రిల్ 19 నుండి జూన్ 1 వరకు ఏడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి.

## బెంగళూరులో నీటి కొరత వేళ.. సూపర్ ఐడియాను నెట్టింట పంచుకున్న ఆనంద్ మహీంద్ర


బెంగళూరు: కర్ణాటక రాజధాని బెంగళూరులో భూగర్భ జలాలు అడుగంటుతుండంతో ప్రజలు నీళ్లు లేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్యకు చెక్ పెట్టేందుకు ప్రముఖ పారిశ్రామికవేత్త, మహీంద్రా గ్రూప్స్ ఛైర్మన్ ఆనంద్ మహీంద్ర ఓ వినూత్న ఐడియాను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. చాలా మంది తమ ఇళ్లు, ఆఫీసులలో ఏసీలు వాడుతుంటారు. అయితే, ఎయిర్ కండీషనర్ల నుంచి బయటకు వచ్చే నీరు మొత్తం వృథాగానే పోతుంటుంది. ఆ నీటిని ఆదా చేసే వినూత్న పద్ధతిని ఓ నెటిజన్ సోషల్ మీడియాలో షేర్ చేశాడు. వీడియోలో ఏసీలోంచి బయటకి వచ్చే నీరంతా ఓ పైప్‌లోకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. దాని చివరి భాగంలో ఓ చిన్న ట్యాప్ బిగించారు. తీవ్ర నీటి ఎద్దడి వేళ బెంగళూరు ప్రజలకు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొంటూ వీడియోను పంచుకున్నారు. 'నీటి కొరత ఉన్నప్పుడు ఏసీ నీటిని సులభంగా సేకరించవచ్చు. ఈ పద్ధతిలో 100 లీటర్ల ఏసీ నీటిని పైపులో నిల్వ చేసుకోవచ్చు. ఈ నీటిని మనం అనేక విధాలుగా వాడుకోవచ్చు. ఇల్లు శుభ్రం చేసుకోవడానికి, మొక్కలకు పోయడానికి, వాహనాలు కడగటానికి తదితర అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు. ఇలా చేయడం వల్ల నీరు ఆదా అవుతాయి. నీటిని ఆదా చేస్తూ.. పొదుపుగా వాడుకోవాలి' అంటూ ఆ వీడియోను పోస్ట్ చేసిన నెటిజన్ పేర్కొన్నారు. సదరు వీడియో ఆనంద్ మహీంద్రను ఆకట్టుకుంది. దీంతో వెంటనే ఆ వీడియోను తన నెటిజన్లతో పంచుకున్నారు నీరు సంపద అని.. సురక్షితంగా నిల్వ చేసుకోవాలని సూచించారు. బెంగళూరులో నీటి సమస్య తీరాలంటే ప్రతీ నీటి బొట్టును జాగ్రత్తగా వాడుకోవాలని ఆయన సూచించారు. ఆయన షేర్ చేసిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.

## ఊహించని ట్విస్ట్.. అక్కడ పోటీకి రాహుల్, ప్రియాంక దూరం?



దేశ వ్యాప్తంగా ఎన్నికల హడావిడీ నెలకొంది. లోక్‌సభతో పాటు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో ప్రచారాలతో ప్రధాన పార్టీలన్నీ హోరెత్తిస్తున్నాయి. గెలుపే ధ్యేయంగా దూసుకుపోతున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో ఓ పెద్ద మార్పు సంభవిస్తున్నట్లు వార్తలు గుప్పుమన్నాయి. ఉత్తరప్రదేశ్‌లోని అమేథీ, రాయ్‌బరేలీ పార్లమెంట్ స్థానాల్లో గాంధీ కుటుంబ సభ్యులు పోటీ చేసే అవకాశం లేదని ప్రచారం జోరుగా నడుస్తోంది. 2024 మార్చి 10న లోక్‌సభ ఎన్నికల్లో ప్రియాంక గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి, రాహుల్ గాంధీ అమేథీ నుంచి పోటీ చేయనున్నట్లు కాంగ్రెస్ ఉత్తరప్రదేశ్ యూనిట్ ఏకగ్రీవంగా తీర్మానించింది. అయితే ఇప్పుడు వారిరువురు ఆ స్థానాల్లో పోటీ చేయకపోవచ్చని సమాచారం. ప్రియాంక గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజకవర్గం నుంచి పోటీ చేయకపోవచ్చు. రాహుల్ గాంధీ కేరళలోని వాయనాడ్ నుంచి మాత్రమే పోటీ చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం మీద పార్టీ అధికారిక ప్రకటన వెల్లడించలేదు. కాబట్టి ఇది నిజమా.. లేక ఒట్టి ప్రచారమేనా అనే విషయాలు తెలియాల్సి ఉంది. 2019లో సిట్టింగ్ ఎంపీ.. కాంగ్రెస్ నేత 'రాహుల్ గాంధీ' అమేథీలో ఓటమిని చవిచూశారు. బీజేపీ అభ్యర్థి స్మృతి ఇరానీ చేతిలో సుమారు 55, 000 ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాగా మరోసారి ఈ నియోజకవర్గంలో 'స్మృతి ఇరానీ'కి బీజేపీ అవకాశం కల్పించింది. అమేథీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీకి కేవలం నియోజకవర్గం మాత్రమే కాదు, 1967 నుంచి ఈ ప్రాంతానికి నెహ్రూ, గాంధీకి అవినాభావ సంబంధం ఉంది. అంతటి కాంగ్రెస్ ప్రతిష్టాత్మక ప్రాంతం నుంచి రాహుల్ గాంధీ పోటీ చేయరు అనే వార్తలు.. కార్యకర్తల్లో కొంత ఆందోళన కలిగిస్తున్నట్లు సమాచారం. 1980లో సంజయ్ గాంధీ అమేథీ గెలుచుకున్నారు. ఈయన మరణాంతరం రాజీవ్ గాంధీ ప్రవేశించారు. 1991లో రాజీవ్ గాంధీ చనిపోయే వరకు అమేథీ వారి చేతుల్లోనే ఉండేది. రాజీవ్ గాంధీ మరణించిన తరువాత 1999 సోనియాగాంధీ ప్రాతినిధ్యం వహించిన స్థానాన్ని 2004లో రాహుల్ గాంధీ చేజిక్కించుకున్నారు. అయితే 2019లో ఓటమిపాలయ్యారు.

## 40 సీట్లు.. 40 రోజులకుపైగా ఎన్నికలు!



దేశంలో సార్వత్రిక ఎన్నికల నగారా మోగింది. 18వ లోక్‌సభ ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వ తేదీ వరకు మొత్తం ఏడు విడతల్లో దేశవ్యాప్తంగా ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల షెడ్యూల్‌లో బిహార్ రాష్ట్రానికి ప్రత్యేకత ఉంది. ఇక్కడ 40 లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా 40 రోజులకు పైగా ఎన్నికలు జరగున్నాయి. ఏప్రిల్ 19 నుంచి జూన్ 1 వరకు ఏడు దశల్లో పోలింగ్ జరుగుతుందని ఎన్నికల సంఘం ప్రకటించింది. జూన్ 4న ఫలితాలు వెల్లడికానున్నాయి.

**దశలు నియోజకవర్గాలు**

దశ 1 (ఏప్రిల్ 19) ఔరంగాబాద్, గయా, నవాడా, జముయి
దశ 2 (ఏప్రిల్ 26) కిషన్‌గంజ్, కతిహార్, పూర్నియా, భాగల్పూర్, బంకా
దశ 3 (మే 7) ఝంఝర్‌పూర్, సుపాల్, అరారియా, మాధేపురా, ఖగారియా
దశ 4 (మే 13) దర్భంగా, ఉజియార్‌పూర్, సమస్తిపూర్, బెగుసరాయ్, ముంగేర్
దశ 5 (మే 20) సీతామర్హి, మధుబని, ముజఫర్‌పూర్, సరన్, హాజీపూర్
దశ 6 (మే 25) వాల్మీకి నగర్, పశ్చిమ్ చంపారన్, పూర్వీ చంపారన్, షెయోహర్, వైశాలి, గోపాల్‌గంజ్, సివాన్, మహారాజ్‌గంజ్
దశ 7 (జూన్ 1) నలంద, పాట్నా సాహిబ్, పాటలీపుత్ర, అర్రా, బక్సర్, ససారం, కరకట్, జహనాబాద్

**2019లోనూ..**

2019లో కూడా బిహార్‌లో ఏప్రిల్ 11 నుండి మే 19 వరకు మొత్తం ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఫలితాలు మే 23న వెల్లడయ్యాయి.

**జేడీ'యూ-టర్న్'**

నితీష్ కుమార్ మరో యూ-టర్న్ తీసుకొని బీజేపీతో చేతులు కలపడంతో బిహార్‌లో 2024 లోక్‌సభ ఎన్నికలపై చాలా ఉత్కంఠ నెలకొంది. 40 సీట్లతో బిహార్ దేశంలో అత్యంత కీలకమైన హార్ట్‌ల్యాండ్ రాష్ట్రాలలో ఒకటిగా ఉంది. బీజేపీ, కాంగ్రెస్ రెండింటికీ రాజకీయంగా ముఖ్యమైనది.

నితీష్ కుమార్ నేతృత్వంలోని జేడీయూతో మళ్లీ పొత్తు కుదుర్చుకోవడంతో రాబోయే ఎన్నికల్లో బీజేపీ తన గత ఎన్నికల కంటే మెరుగైన పనితీరు కనబరుస్తుందని అంచనా వేస్తోంది. బీహార్ మాజీ సీఎం లాలూ యాదవ్ కుమారుడు తేజస్వీ యాదవ్ నేతృత్వంలోని ఆర్‌జేడీతో పాటు కాంగ్రెస్ నుంచి గట్టి సవాల్ ఎదుర్కోనుంది. గత సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ 22 సీట్లు గెలుచుకోగా, జేడీయూ 16 సీట్లు గెలుచుకుంది. రెండు పార్టీలు కూటమిగా ఆ ఎన్నికల్లో పోటీ చేశాయి. ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీ సీనియర్ మిత్రపక్షంగా జేడీయూ అవతరించింది. ఎన్డీయేలో భాగమైన ఎల్‌జేపీ 6 సీట్లు గెలుచుకుంది. మహాఘటబంధన్‌లో భాగమైన కాంగ్రెస్ బిహార్‌లో కేవలం ఒక్క సీటు మాత్రమే సాధించింది. 23.58 శాతం ఓట్ షేర్‌తో అత్యధిక ఓట్లను కూడా బీజేపీ కైవసం చేసుకుంది. ఆసక్తికరంగా ఈసారి నితీష్ కుమార్ పార్టీతో పొత్తుతో బీజేపీ బరిలోకి దిగుతోంది. భారతీయ జనతా పార్టీ ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లో 17 స్థానాల్లో పోటీ చేస్తుండగా జేడీయూ 16 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టనుంది. మిగిలిన 7 నియోజకవర్గాల్లో ఎల్‌జేపీ, ఇతర మిత్రపక్షాలు పోటీ చేయనున్నాయి.

## ఎలక్టోరల్ బాండ్స్‌పై ఆర్ఎస్ఎస్ స్పందనిదే..

**నాగపూర్:** రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వడానికి ఉద్దేశించిన ఆర్థిక సాధనమైన ఎలక్టోరల్ బాండ్ల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్న క్రమంలో దీనిపై రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ స్పందించింది. ఎలక్టోరల్ బాండ్స్‌ను ప్రయోగాకత్మకంగా తీసుకోవాలని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసబలె అన్నారు. "ఎలక్టోరల్ బాండ్స్ అనేవి అకస్మాత్తుగా ఈరోజు ప్రవేశపెట్టినవి కాదు. ఇలాంటి స్కీమ్‌లు గతంలో కూడా తెచ్చారు. ఎప్పుడైనా ఒక మార్పునకు శ్రీకారం చుట్టినప్పుడు సహజంగానే ప్రశ్నలు తలెత్తుంటాయి. ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు)లను ప్రవేశపెట్టినప్పుడు కూడా ఈ తరహా ప్రశ్నలే వచ్చాయి" అని ఆదివారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ హొసబలె చెప్పారు. కొత్త సిస్టమ్ ఏ విధంగా ప్రయోజనకారిగా, సమర్ధవంతంగా ఉంటుందో అనేది కాలమే చెబుతుందని, దీనికి ఒక ఎక్స్‌పర్‌మెంట్‌గానే చూడాలని ఆర్ఎస్ఎస్ భావిస్తోందని అన్నారు.. ఆర్ఎస్ఎస్ సర్‌కార్యవహ్ (ప్రధాన కార్యదర్శి)గా హొసబలె ఆదివారంనాడు తిరిగి ఎన్నికయ్యారు.

## 'ఆ రెండు రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలు మార్చాలి'

**తమిళనాడులో ఏప్రిల్ 19న, కేరళలో ఏప్రిల్ 26న ఎన్నికలు**

**ఈ రెండు తేదీలు శుక్రవారం వస్తాయి**

**దీంతో ఎన్నికల తేదీలను మార్చాలని ఐయూఎంఎల్ డిమాండ్**



**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం 18వ లోక్‌సభ ఎన్నికల తేదీలను ప్రకటించింది. అయితే కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో పార్లమెంట్ ఎన్నికల తేదీలను మార్చాలని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ డిమాండ్ చేస్తోంది. ఈమేరకు ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయించను న్నట్లు తెలిపింది.

**కారణం ఇదే..**

కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించిన లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకారం.. తమిళనాడులో ఏప్రిల్ 19న, కేరళలో ఏప్రిల్ 26న ఎన్నికలు జరగనున్నాయి. ఈ రెండు తేదీలు శుక్రవారం వస్తాయి. దీంతో ఎన్నికల తేదీలను మార్చాలని ఐయూఎంఎల్ డిమాండ్ చేస్తోంది. శుక్రవారం ముస్లింలకు ముఖ్యమైన రోజు కాబట్టి ఓటర్లు, అధికారులు, అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లో ఎన్నికల తేదీలను మార్చాలని ఈసీఐని ఆశ్రయించనున్నట్లు యూడీఎఫ్‌లోని ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి ప్రధాన మిత్రపక్షమైన ఐయూఎంఎల్ తెలిపింది. ఐయూఎంఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎంఏ సలామ్ పీటీఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ ప్రార్థనల కోసం మసీదులలో గుమిగూడే ముస్లింలకు శుక్రవారం ముఖ్యమైన రోజు అన్నారు. "శుక్రవారం పోలింగ్ నిర్వహణ ఓటర్లు, అభ్యర్థులు, పోలింగ్ ఏజెంట్లు, ఎన్నికల విధులు కేటాయించిన అధికారులకు అసౌకర్యాన్ని కలిగిస్తుంది. అందుకే ఈసీఐని ఆశ్రయిస్తాం" అని సలామ్ పేర్కొన్నారు. ఐయూఎంఎల్‌తోపాటు ఇతర ముస్లిం సంస్థలు కూడా ఎన్నికల తేదీల మార్పు కోసం ఎలక్షన్ కమిషన్‌ను ఆశ్రయించాలని యోచిస్తున్నట్లు సమాచారం.

## ఆ రెండు రాష్ట్రాల కౌంటింగ్ తేదీల్లో మార్పు




**ఢిల్లీ:** సార్వత్రిక ఎన్నికలతో పాటు నాలుగు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం శనివారం పోలింగ్ షెడ్యూల్ విడుదల చేసింది. అయితే తాజాగా.. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల ఎన్నికల సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ రెండు రాష్ట్రాలకు సంబంధించిన కౌంటింగ్ తేదీల్లో మార్పులు చేసింది సీఈసీ. ఈమేరకు కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్‌ను సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ కంటే రెండు రోజుల ముందే జూన్ 2వ తేదీన చేపట్టనున్న ఈసీ వెల్లడించింది. అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం అసెంబ్లీల గడువు జూన్ రెండో తేదీన ముగియనున్న నేపథ్యంలో ఈసీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇక.. ఏప్రిల్ 19న మొదటి విడతలో భాగంగా అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరగనుంది. అరుణాచల్ ప్రదేశ్‌లో 60 అసెంబ్లీ స్థానాలు, సిక్కింలో 32 స్థానాలకు పోలింగ్ జరగనుంది. తాజా మార్పు ప్రకారం ఫలితాలు జూన్ రెండున వెల్లడికానున్నాయి.

## కాంగ్రెస్‌కు షాక్.. బీజేపీలో చేరిన మరో సీనియర్ ఎమ్మెల్యే



ఉత్తరాఖండ్‌లో కాంగ్రెస్‌కు మరో షాక్ తగిలింది. బద్రీనాథ్ నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యే రాజేంద్ర భండారీ పార్టీకి రాజీనామా చేసి ఇవాళ (ఆదివారం) బీజేపీలో చేరారు. ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామీ, కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సమక్షంలో ఢిల్లీ కేంద్ర కార్యాలయంలో బీజేపీలో చేరారు. బీజేపీలో చేరిన తరువాత రాజేంద్ర భండారీ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ సమర్ధవంతమైన నాయకత్వంపై విశ్వాసం ఉందన్నారు. మోదీ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్న తీరు చాలా గొప్పగా ఉందని కొనియాడారు. తప్పకుండా ప్రధాని అడుగుజాడల్లో నడుస్తామని, బీజేపీని గెలిపిస్తామని అన్నారు. రాజేంద్ర భండారీ కాంగ్రెస్ పార్టీకి ఎందుకు రాజీనామా చేశారనే విషయం వెల్లడించలేదు. కేవలం ఏక వాక్యంలో రాజీనామా లేఖ రాసి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షునికి పంపించినట్లు తెలుస్తోంది. భండారీ మూడు పర్యాయాలు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మాజీ మంత్రిగా పనిచేసారు.

# ఖబడ్దార్ రేవంత్.. నోరు, ఒళ్లు దగ్గరపెట్టుకో



**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు మాజీ మంత్రి, మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్. రేవంత్ రెడ్డి ఖబడ్దార్.. నోరు, ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడలంటూ హెచ్చరించారు. ఫోన్ ట్యాంపింగ్ చేస్తున్నారని మండిపడ్డారు. వ్యాపారస్తులను బ్లాక్ మెయిల్ చేస్తున్న వసూళ్ల చిట్టా రికార్డ్ అవుందని అన్నారు. నడమంత్రపు సిరిలాగా ముఖ్యమంత్రి పదవి వచ్చిన రేవంత్ రెడ్డి.. రెండు నాల్కలధోరణితో మాట్లాడుతున్నారని విమర్శలు గుప్పించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమకు పెద్దన్న అని.. ఆయన ఆశీర్వాదం ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఇటీవల రేవంత్ మాట్లాడిన ఈటల చెప్పుకొచ్చారు. ఎన్నో సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న కొంపల్లి, అల్వాల్ ఫ్లై ఓవర్ కోసం 175 ఎకరాల రక్షణ రంగ భూమిని మోదీ కేటాయించారని చెప్పిన సీఎం .. మళ్లీ అదే నోటితో ప్రధానిని తిడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేసీఆర్ కూడా అలానే మాట్లాడారని, ఆయనకు పట్టిన గతే రేవంత్ రెడ్డికి కూడా పడుతుందంటూ హెచ్చరించారు. నోరు, ఒళ్లు దగ్గర పెట్టుకోని జాగ్రత్తగా మాట్లాడాలని రేవంత్ రెడ్డికి ఈటల రాజేందర్ హితవు పలికారు. అధికారం ఉందని ఏది పడితే అది మాట్లాడితే సహించడానికి ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు. కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్ చేశారని విమర్శించిన రేవంత్ కూడా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్టు తెలుస్తోందన్నారు. అప్రజాస్వామికంగా వ్యవహరిస్తే ఖబడ్దార్ అని వార్నింగ్ ఇచ్చారు. పిల్లి కళ్లు మూసుకొని పాలుతాగినట్టు రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారని ఈటల రాజేందర్ ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీకి ఫండ్స్ పంపించడానికి ఇక్కడ ఉన్న వ్యాపారస్తులను ఎంత వేదిస్తున్నది, ఎంత బ్లాక్ మెయిల్ చేస్తున్నది రికార్డ్ అవుతుందన్నారు. "ఒక్క రాష్ట్రంలో ఉండి నేనే అన్నీ అనుకుంటున్నావని. నిన్ను వీక్షించే వారు కూడా ఉన్నారు అని మర్చిపోకు." అంటూ వార్నింగ్ ఇచ్చారు. మల్కాజ్‌గిరిలో ఎవరు వచ్చినా.. ఎన్ని డబ్బులు ఖర్చుపెట్టినా.. గెలిచేది బీజేపీనే అని.. ఈటల రాజేందర్ దీమా వ్యక్తం చేశారు. పిల్లి కళ్ళు మూసుకొని పాలుతాగినట్టు సీఎం రేవంత్ వ్యవహరిస్తున్నారని ఈటల మండిపడ్డారు. రాహుల్ గాంధీకి ఫండ్స్ పంపించడానికి ఇక్కడ ఉన్న వ్యాపారస్తులను ఎంత వేధిస్తున్నది, ఎంత బ్లాక్ మెయిల్ చేస్తున్నందంతా రికార్డ్ అవుతుందన్నారు. మల్కాజిగిరిలో ఎవరు వచ్చినా, ఎన్ని డబ్బులు ఖర్చుపెట్టినా గెలిచేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు.

# ఆ రెండు పార్టీలకు చుక్కలే..

-మొదటి పేజి తరువాయి

చేశారన్నారు. సచివాలయం, కాళేశ్వరం లాంటివి చూపి ప్రజల స్వేచ్ఛను హరించారని చెప్పారు.

75 ఏళ్ల తర్వాత తెలంగాణ ప్రజలు పోరాడి మళ్లీ స్వేచ్ఛను తెచ్చుకున్నారని అన్నారు. కేసీఆర్ నయా నిజాంలా వ్యవహరించారని అన్నారు. నిజాం విధానాల నకలును కేసీఆర్ రాష్ట్రంలో అమలు చేశారని మండిపడ్డారు. అందుకే ప్రజలు కేసీఆర్ విధానాలను వ్యతిరేకించి.. ప్రజా ప్రభుత్వాన్ని తెచ్చుకున్నారన్నారు. వంద రోజుల ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛను అందించామని తెలిపారు. 6 గ్యారంటీలను అమలు చేస్తూ ముందుకెళ్తున్నామని చెప్పారు. ఇన్నాళ్లు కవులు, కళాకారులను కేసీఆర్ తన గడీలో బంధించారని ధ్వజమెత్తారు. దొరగారి (కేసీఆర్) భుజకీర్తులను సాగించాలని తెలంగాణ సాంస్కృతిక చరిత్రపై దాడి చేశారన్నారు. అందుకే తమ ప్రభుత్వం ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నామని అన్నారు. ప్రగతి భవన్ ముళ్ల కంచెను బద్దలు కొట్టి ప్రజలకు స్వేచ్ఛను కల్పించామన్నారు. రాష్ట్ర పరిపాలనను నిర్దేశించే సచివాలయంలో అందరికీ ప్రవేశం కల్పించామని తెలిపారు. తాము పాలకులం కాదు.. సేవకులం అని తెలిపేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రంతో ఈటల విచారణ చేయించాలి**

"మాజీ మంత్రి ఈటల రాజేందర్‌కు చిత్తశుద్ధి ఉంటే ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్రంతో విచారణ చేయించాలి. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అంటే నాకు ఇప్పటికీ గౌరవం ఉంది. ఉద్యోగంలో ఉంటే ప్రవీణ్ డీజీపీ అయ్యేవారు. టీఎస్పీఎస్సీ ఛైర్మన్ పదవిని ప్రవీణ్‌కు ఆఫర్ చేశా.. కానీ ఆయన ఒప్పుకోలేదు. కేసీఆర్ పార్టీలో ప్రవీణ్ చేరుతారని భావించడం లేదు. గులాబీ పార్టీలో చేరితే సమాధానం చెప్పుకోవాల్సింది ఆయనే. కొండలు, గుట్టలు, లే అవుట్లకు రైతు భరోసా ఇవ్వబోము. నిధుల దుర్వినియోగం జరగకుండా చర్యలు తీసుకుంటాం. కొద్దిమంది అవినీతి అధికారులతో సాగించిన కేసీఆర్ పాలనకు స్వస్తి చెప్పాం. పరిపాలన వికేంద్రీకరణ చేసి పారదర్శక పాలన అందించే ప్రయత్నం చేశాం. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముందుకెళ్తున్నాం. 6 గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదలను ఆదుకుంటున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 లకే గ్యాస్ పథకాలను అమలు చేస్తున్నాం. ఇప్పటి వరకు 8లక్షల కుటుంబాలకు రూ.500 గ్యాస్ సిలిండర్ అందించాం. 200 యూనిట్ల ఉచిత కరెంటును అమలు చేశాం. మాజీ మంత్రి హరీశ్‌రావు ఇంటిపేరులో తన్నీరు ఉన్నంత మాత్రానా ఆయన పన్నీరు కాదు.. జీరో బిల్‌ను మేం అమలు చేస్తుంటే హరీశ్‌రావు అతి తెలివి తేటలు ఉపయోగించి అడ్డుకోవాలని చూస్తున్నారు" అని సీఎం రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు..

**అక్రమార్కులను విడిచి పెట్టం**

"అక్రమార్కులు ఎంతటి వారైనా విడిచిపెట్టం. తులసి వనంలో కొన్ని గంజాయి మొక్కలను నాటి వెళ్లారు... అవి దుర్గంధం వెదజల్లుతున్నాయి.. అలాంటి గంజాయి మొక్కల్ని మొక్కలను ఒక్కొక్కటిగా పీకేస్తున్నాం. రోజుకు 18గంటలు పనిచేసి మొత్తం గంజాయి మొక్కల్ని పీకేస్తాం. జీరో బిల్లుతో పేదలకు ఉచిత కరెంటు అందిస్తోంటే.. కొంతమంది అడ్డు తగులుతున్నారు. జీరో బిల్లుతో పేదలకు ఉచిత కరెంటు అందిస్తోంటే.. కొంతమంది అడ్డు తగులుతున్నారు. వాళ్ల అడ్డు తొలగించి పేదలకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేసి తీరుతాం. మేం అప్పుల గురించి మాట్లాడితే వాళ్లు ఆస్తుల గురించి మాట్లాడుతున్నారు. రాష్ట్రంపై రూ.9 లక్షల కోట్ల అప్పుల భారం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన రోజు ఏడాదికి చెల్లించాల్సిన అప్పు రూ.6 వేల కోట్లని.. కానీ ఇప్పుడు ఏడాదికి రూ.64 వేల కోట్లు చెల్లించాల్సిన పరిస్థితికి రాష్ట్రాన్ని కేసీఆర్ తీసుకొచ్చారు.. ప్రతీ ఏడాది రూ.70 వేల కోట్లు అప్పుల రూపంలో చెల్లించాల్సిన పరిస్థితి. కేంద్ర ప్రభుత్వంతో, తెలంగాణ గవర్నర్ తమిళిసైతో సామరస్యపూర్వక విధానాలతో ముందుకెళ్తున్నాం. సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకెళు_న్నాం. మీ అందరి సహకారంతో ఒక మంచి పరిపాలన అందిస్తాం. వైబ్రాంట్ తెలంగాణనే మా లక్ష్యం. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి వేల కోట్లకు చేరింది... చట్టబద్ధంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. బతుకమ్మను కొందరు వ్యాపార వస్తువుగా, ఆటవస్తువుగా మార్చారు. బతుకమ్మ, బోనాలు అనాదిగా తెలంగాణలో జరుపుకుంటున్న పండుగలు.. ఎవరు ఉన్నా.. ఎవరు లేకున్నా... బతుకమ్మ, బోనాల పండుగలు ఘనంగా జరుగుతాయి. ప్రైవేట్ చేతిలో ఉన్న ధరణిని ప్రభుత్వ సంస్థకు అప్పగించాం. ధరణి పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే తప్పు.. అవినీతి జరిగిందా లేదా అనే విషయం బయటపడదు. తప్పులకు కారణమైన వారిని ఉపేక్షించేది లేదు" అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు.



**కలుపు మొక్కలను ఏరిపారేస్తున్నాం..**

గత ఏడాది డిసెంబర్ 3న తెలంగాణలో ప్రజలు అద్భుత తీర్పు ఇచ్చారని, స్వేచ్ఛకు మించింది ఏదీ లేదని నిరూపించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. నిజాంను తరిమికొట్టిన చరిత్ర ఉన్న తెలంగాణ మళ్లీ అలాంటి రాజరిక పోకడలు అవలంబించిన కేసీఆర్‌కు బుద్ధి చెప్పారన్నారు. మా ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తైంది. లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. నిన్నటిదాకా సీఎంగా నిబద్ధతతో పనిచేశా. ఇక పార్టీ అధ్యక్షునిగా నన్ను చూస్తారు. ఎన్నికల నగారా మోగినందున ఎన్నికల్లో నా రాజకీయ రూపం చూస్తారు. సీఎంగా వందవ రోజు ఒక గేట్ ఓపెన్ చేశా. అవతల వర్గం ఖాళీ అయితే గేట్లు మూసినా తెరచినా ఒక్కటే. ప్రభుత్వాన్ని పడగొడతామంటే చూస్తూ ఊరుకుంటానా. కుక్క కాటుకు చెప్పు దెబ్బ అన్నారు పెద్దలు కొట్టకుండా ఊరుకుంటామా. యువకుల ఆత్మబలిదానాలతో సమైక్య పాలన నుంచి విముక్తి పొంది ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడ్డ తెలంగాణలో కేసీఆర్ రాజరికపోకడలను మళ్లీ తీసుకువచ్చారు. తన వారసులే ఆధిపత్యం చెలాయించాలని కోరుకున్నారు. కేసీఆర్ నిజాం నకలునే మళ్లీ చూపించాడు. ప్రశ్నిస్తే అణచివేయాలనుకున్నాడు. తిరుగుబాటు చేసినవారందరినీ అణచివేశాడు. దీంతో ప్రజలు మార్పు కోరుకుని కాంగ్రెస్ పరిపాలనను తీసుకువచ్చారు.

ధర్నాచౌక్ వద్దు అన్న వారిని కూడా ధర్నా చేసుకోనిచ్చిన ప్రభుత్వం మాది. ప్రగతిభవన్ కంచెలు బద్దలు కొట్టి ప్రజలకు ప్రవేశం కల్పించాం. ముఖ్యమంత్రి సహా మంత్రులందరూ ప్రజలకు అందుబాటులో ఉన్నారు. సామంతులలాగా అధికారం కొద్ది మంది అధికారుల చేతిలో పెట్టకుండా అధికారులందరికీ పాలనలో స్వేచ్ఛను కల్పించి పారదర్శకతను తీసుకువచ్చాం. ఉద్యమంలో మాట్లాడిన మాటలను మర్చిపోయి కేసీఆర్ తెలంగాణ సంస్కృతిని చెరిపే ప్రయత్నం చేశారు. మేం వచ్చిన తర్వాత జయజయహే తెలంగాణను రాష్ట్ర గీతంగా మార్చి తెలంగాణ తల్లి విగ్రహంలో మార్పులు చేశాం.

ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉచిత బస్సు తీసుకువచ్చి, ఆరోగ్యశ్రీ పరిమితి పెంచాం. గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్ ఇస్తున్నాం. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చాం. తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరి కమిషన్(ఈఆర్సీ)లో కేసీఆర్ నాటిన గంజాయి మొక్క ఒకటి గృహజ్యోతి డబ్బులు ముందే డిస్కంలకు ఇవ్వాలని ప్రభుత్వానికి నోటీసు ఇచ్చింది. ఇచ్చిన వ్యక్తి ఇంటి పేరు కూడా తన్నీరు. ఈ తన్నీరుకు గతంలో రైతులకు ఉచిత విద్యుత్ డబ్బులు కేసీఆర్ ముందే ఇచ్చాడో లేదా తెల్వదా. ఈ గంజాయి మొక్కలన్నింటిని సమూలంగా పీకేస్తాం' అని రేవంత్ హెచ్చరించారు.

**కేసీఆర్ కుటుంబం పతనమైంది.. రేవంత్ సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్ విమోచన దినానికి, 2023 డిసెంబర్-03వ తేదీకి ఒకే చరిత్ర ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. 7 తరాలుగా నిజాం రాజ్యాన్ని పాలించిన పాలకుల నుంచి ప్రజలకు విముక్తి లభించినట్లే బీఆర్ఎస్ ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి, ప్రజలకు విముక్తి లభించిందని స్ట్రాంగ్ కామెంట్స్ చేశారు. ఎన్ని మంచి పనులు చేసినా బానిసలుగానే చూశారని, స్వేచ్ఛను లాక్కున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజాం ప్రభువుల ఆగడాలు తట్టుకోలేక నాడు తిరుగుబాటు చేస్తే నేడు గులాబీ నేతల నుంచి రాష్ట్రాన్ని కాపాడుకున్నారని వివరించారు. స్వేచ్ఛ లాక్కుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు.

1948 సెప్టెంబర్ 17లో దేశం ఒక్కసారిగా మన వైపు చూసింది. ప్రపంచంలో ఎక్కడ అణచివేత ఉంటుందో అక్కడ వాళ్లకు స్ఫూర్తి ఇచ్చింది. అరాచకం నుంచి విముక్తి పొందేందుకు సాయుధ పోరాట జరిగింది. నిజాం హయాంలోని ఖాసిం రజ్వీ ఆధిపత్యాన్ని తాను చలాయించాలని కేసీఆర్ అనుకున్నారు. సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో మార్పు కావాలి కాంగ్రెస్ రావాలి అని ప్రజలు తీర్పు ఇచ్చారు. ఆ పోరాటంలో కేసీఆర్ కుటుంబం పతనం అయ్యింది. నిజాం, కేసీఆర్ ఇద్దరి పేర్లు మాత్రమే వేరు. కానీ సారూప్యత ఒకటే.


బతుకమ్మ పండుగను కొందరు వ్యాపార వస్తువుగా, ఆటవస్తువుగా మార్చారని సీఎం రేవంత్ ఫైర్ అయ్యారు. బతుకమ్మ, బోనాలు అనాదిగా తెలంగాణలో జరుపుకుంటున్న పండుగలు అని చెప్పారు. ఎవరు ఉన్నా లేకున్నా ఈ పండుగలు జరుగుతాయని చెప్పారు. ప్రైవేట్ చేతిలో ఉన్న ధరణిని ప్రభుత్వ సంస్థకు అప్పగించామన్నారు. ధరణి పోర్టల్‌ను ఫోరెన్సిక్ ఆడిట్ చేస్తే అసలు విషయం బయటపడుతుందని పేర్కొన్నారు. తప్పులకు కారణమైన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

**ప్రభుత్వాన్ని పడగొడతామంటే చూస్తూ ఊరుకోం..**

ప్రభుత్వాన్ని పడగొడతామంటే చూస్తూ ఊరుకోం.. కేసీఆర్ నాటిన కలుపు మొక్కలను ఏరిపారేస్తున్నాం.. అంటూ సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మీట్ ద ప్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. తమ వంద రోజుల పాలనలో ఎలాంటి పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించలేదన్నారు సీఎం రేవంత్ రెడ్డి. అయితే ప్రభుత్వాన్ని కూల్చుతామంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎన్నికల నగారా మోగడంతో తన రాజకీయ రూపం చూపిస్తానని అన్నారు. తాను కేంద్రం, గవర్నర్ ఇతర రాజ్యాంగబద్ధమైన వ్యవస్థలతో ఘర్షణ వాతావరణం కోరుకోవడం లేదని రేవంత్ రెడ్డి అన్నారు. తమ పాలనతో ఈ విషయాన్ని స్పష్టం చేశామన్నారు. ప్రజలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ ఇచ్చేందుకు ప్రయత్నిస్తుంటే కొందరు అడ్డుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ నాటిన కలుపుమొక్కలను ఏరిపారేస్తామన్నారు.. 5 ఎకరాలలోపు ఉన్న వారికి రైతు భరోసా ఇచ్చామని దానిని నెరవేరుస్తామని సీఎం రేవంత్ పేర్కొన్నారు. ఎన్నికల నగారా మోగడంతో రాజకీయ రూపం చూపిస్తానంటూ రేవంత్ పేర్కొన్నారు.

## పదేళ్లలో తెలంగాణ ఇబ్బందులకు గురైంది

-మొదటి పేజి తరువాయి



కిషన్ రెడ్డి మాట్లాడుతూ... పోరాటాలతో వచ్చిన తెలంగాణ ఒక కుటుంబం చేతిలో బలి అయ్యిందన్నారు. పదేళ్లలో తెలంగాణ ఇబ్బందులకు గురైందని చెప్పారు. ధర్నా చౌక్‌ను కూడా గత బీఆర్ఎస్ ప్రభుత్వం బ్యాన్ చేసిందని మండిపడ్డారు. అనేక కారణాలతో కేసీఆర్ ఓడిపోయారు కాని తెలంగాణ గెలవలేదని చెప్పారు. కాంగ్రెస్ డిక్లరేషన్‌ల పేరుతో ప్రకటనలు చేయించారని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలకు అమలు చేయడం లేదన్నారు. మహిళలకు నెలకు రూ. 2500 పథకం, రైతు భరోసా రూ.2లక్షల రుణమాఫీ హామీ ఏమైందని ప్రశ్నించారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12వేల రూపాయలపై వరిపంటకు బోనస్ పైనా స్పష్టత లేకుండా పోయిందని చెప్పారు. విద్యార్థులకు విద్యా భరోసా కార్డు విషయం మరచిపోయినట్టు కనిపిస్తుందని అన్నారు.

పాల ఉత్పత్తి దారులకు లీటరుకు రూ.5 బోనస్ అమలు చేయలేదని మండిపడ్డారు. నిరుద్యోగ యువతకు ఇస్తామన్న రూ. 4వేల నిరుద్యోగ భృతి గారడిగానే మారిందన్నారు. అమ్మాయిలకు ఇస్తామన్న స్కూటీలు ఇవ్వలేదన్నారు. మహిళలకు పదిలక్షల వడ్డీ లేని రుణాల హామీను ఎందుకు అమలు చేయటం లేదని ప్రశ్నించారు. రేషన్ కార్డులు ఎప్పుడు ఇస్తారని... అసలు ఇస్తారా ఇవ్వరో చెప్పాలని నిలదీశారు. 57ఏళ్లు నిండిన వారికీ ఇస్తానన్న రూ.4వేల చేయూత ఏమైందని ప్రశ్నించారు. హామీలను ఇచ్చి అమలు చేయకుండా తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ వెన్నుపోటు పొడిచిందని విరుచుకుపడ్డారు. ప్రశ్నిస్తున్న తెలంగాణ పేరుతో నేటి నుంచి క్యాంపెయిన్ ప్రారంభించామని తెలిపారు. ఇచ్చిన గ్యారెంటీలు అమలు చేసే వరకు ఈ ప్రభుత్వంను వెంటాడుతామని కిషన్‌రెడ్డి హెచ్చరించారు.

## ఎమ్మెల్సీ కవితతో కేటీఆర్, హరీష్ రావు భేటీ



-మొదటి పేజి తరువాయి

వెసులుబాటును కోర్టు కల్పించిన సంగతి తెలిసిందే. కుటుంబ భోజనం తెప్పించుకోవడానికి కూడా కోర్టు అనుమతించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ కస్టడీలోకి తీసుకున్న నేపథ్యంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రశాంరెడ్డి తదితరులు ఆదివారం ఢిల్లీకి వెళ్లారు. సాయంత్రం ఈడీ కార్యాలయానికి హరీష్ రావు, కేటీఆర్, కవిత భర్త అనిల్, అడ్వకేట్ మోహిత్ రావు చేరుకున్నారు. వీరంతా కవితతో గంటపాటు భేటీ కానున్నారు. కాగా ఈడీ కస్టడీలో ఉన్న సమయంలో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7గంటల వరకు కుటుంబ సభ్యులను కలిసేందుకు కోర్టు అనుమతిచ్చింది. కవితతో భేటీ అనంతరం న్యాయవాదులు, నిపుణులతో కూడా మాట్లాడుతారు. తదుపరి చేపట్టాల్సిన చర్యలపై ఒక నిర్ణయానికి వస్తారని తెలుస్తోంది. న్యాయపరంగా ఎలా ఎదుర్కోవాలన్నదానిపైనే వీరు ప్రధానంగా దృష్టిసారించనున్నారు. ఇక కాగా ఢిల్లీ మద్యం పాలసీ మనీలాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను శుక్రవారం సాయంత్రం ఈడీ అధికారులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే.

శనివారం ఉదయం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఆమెను హాజరుపరిచారు. ప్రత్యేక న్యాయమూర్తి ఎంకే నాగ్ పాల్ ఎదుట హజరు పరిచారు. కవిత తరపు న్యాయవాదులు, ఈడీ తరపు న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ఈనెల 23వరకు కోర్టు ఈడీ కస్టడీ విధించింది. ఆరోజు మధ్యాహ్నం తిరిగి కవితను కోర్టులో హాజరుపర్చాలని అధికారులను కోర్టు ఆదేశించింది. కోర్టు తీర్పుతో కవితను కస్టడీలోకి తీసుకున్న ఈడీ అధికారులు.. తమ కేంద్ర కార్యాలయంలోని ప్రత్యేక సెల్‌లో ఆమెను ఉంచారు. నేటి నుంచి సీసీటీవీల పర్యవేక్షణలో కవితను ఈడీ అధికారులు విచారిస్తున్నారు.

## బీఆర్ఎస్‌కు షాక్



-మొదటి పేజి తరువాయి

నేతలు బీఆర్ఎస్‌ను వీడుతున్నారు. తాజాగా పార్టీకి రాజీనామా చేసిన చేవెళ్ల బీఆర్ఎస్ ఎంపీ రంజిత్ రెడ్డి, ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేదంర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌ఛార్జి దీపాదాస్ దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ ఇద్దరు నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

**ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డేనా..?**

రంజిత్‌రెడ్డి చేవెళ్ల నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారనే ప్రచారం జరుగుతోంది. మొదట బీజేపీలో ఆయన చేరతారనే ప్రచారం జరిగినా.. ఆ పార్టీ చెవేళ్ల ఎంపీ అభ్యర్థిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డిని ప్రకటించింది. దీంతో కాంగ్రెస్ రంజిత్ రెడ్డికి ఎంపీ టికెట్ ఆఫర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. వాస్తవానికి పట్నం మహేందర్ రెడ్డి భార్య సునీతారెడ్డి చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తారనే చర్చ జరిగింది. తెలంగాణలో మారుతున్న రాజకీయ పరిణామాలతో సునీత రెడ్డికి మల్కాజ్‌గిరి టికెట్ ఇచ్చి, రంజిత్ రెడ్డిని చెవెళ్ల నుంచి పోటీ చేయించాలనే ఆలోచనలో కాంగ్రెస్ ఉన్నట్లు తెలుస్తోంది.

**ని'దానం'గానే చేరిపోయారుగా..!**

రంజిత్‌రెడ్డితో పాటు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. గతంలో ఆయన కాంగ్రెస్ పార్టీలో మంత్రిగా పని చేశారు. 2018లో ఆయన బీఆర్ఎస్‌లో చేరారు. తాజాగా ఆ పార్టీని వీడి హస్తం గూటికి చేరుకున్నారు. అయితే నిన్న, మొన్నటి వరకూ అబ్బే బీఆర్ఎస్‌ను వీడే ప్రసక్తే లేదన్నట్లుగా చెప్పిన దానం.. నిదానంగా కారు దిగేసి.. కాంగ్రెస్ కండువా కప్పేసుకున్నారు. సికింద్రాబాద్ ఎంపీగా దానం పోటీచేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి.

## కవిత అరెస్ట్ చట్టబద్ధమే..

-మొదటి పేజి తరువాయి



ఈడీ అధికారులు ప్రవేశపెట్టారు. విచారణ అనంతరం, ఈడీ కోరిక మేరకు కవితను ఏడు రోజుల పాటు కస్టడీ విధించింది కోర్టు. ఈ సందర్భంగా కస్టడీకి ఇచ్చిన ఉత్తర్వుల్లో కోర్టు సంచలన విషయాలను వెల్లడించింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం..'కవిత అరెస్టు చట్టబద్ధమే. కవితను అరెస్టు చేయవద్దని ఎక్కడా సుప్రీంకోర్టు లిఖిత పూర్వక ఆదేశాలు ఇవ్వలేదు. తదుపరి విచారణ వరకు మాత్రమే సమన్లు ఇవ్వమని ఈడీ సుప్రీంకోర్టుకు చెప్పింది. ఆ తర్వాత రెండుసార్లు ఈడీ సమన్లు ఇచ్చినప్పటికీ కవిత సుప్రీంకోర్టులో వాటిని ఛాలెంజ్ చేయలేదు. సుప్రీంకోర్టుకి ఇచ్చిన మాట తప్పారా? లేదా అన్నది మా పరిధిలో నిర్ణయించే అంశం కాదు. సెక్షన్-19 ప్రకారం అన్ని నిబంధనలు పాటిస్తూ అరెస్టు చేశారా? లేదా అన్నది మాత్రమే చూస్తాం. కవితను చట్టబద్ధంగానే అరెస్టు చేశారు. మనీలాండరింగ్ చట్టం సెక్షన్-19 కింద అన్ని నిబంధనలను పాటించారు. ఈ నేరాల్లో కవిత కీలక పాత్ర పోషించారనేదానికి ఆధారాలు ఉన్నాయి. అందుకే ఆమెను రిమాండ్ చేస్తూ దర్యాప్తు కోసం ఏడు రోజుల ఈడీ కస్టడీకి అప్పగిస్తున్నాం. సీసీటీవీ కవరేజ్‌లో ఆమెను ఇంటరాగేషన్ చేయాలి. సీసీటీవీ ఫుటేజ్‌ను భద్రపరచాలి. మహిళను విచారించే సమయంలో తీసుకోవలసిన అన్ని నిబంధనలు పాటించాలి. ఆమె తరపు న్యాయవాదులు ప్రతీరోజు అరగంట పాటు కలవవచ్చు. ఆమె భర్త అనిల్, సోదరుడు కేటీఆర్ , బావ హరీష్ రావు, కజిన్ శ్రీధర్, ప్రణీత్ కుమార్, శరత్ కలుసుకునే అవకాశం ఉంది. అరెస్టు తరువాత హైబీపీకి గురైనట్లు ఈసీజీ రిపోర్టు ఉన్న నేపథ్యంలో తగిన మందులు ఇవ్వాలి. 24 గంటలకు ఒకసారి కవితకు వైద్య పరీక్షలు చేయాలి' అని కోర్టు పేర్కొంది.


## సంపాదకీయం

# వై నాట్ సౌత్ అంటున్న కమలం

370 టార్గెట్‌గా.. వై నాట్ సౌత్ అని అంటోంది భారతీయ జనతా పార్టీ. ఉత్తరాది మొత్తాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలిస్తున్న కాషాయ పార్టీకి.. దక్షిణ భారతం మాత్రం అంతు చిక్కడం లేదు. తెలంగాణలో డబుల్ డిజిట్ ఎంపీ సీట్లే లక్ష్యంగా బీజేపీ అడుగులు వేస్తోంది. పదిరోజుల్లో రెండోసారి తెలంగాణకు ప్రధాని మోదీ వస్తున్నారు. రెండు రోజుల పాటు రోడ్‌షోలు, బహిరంగ సభల్లో మోదీ పాల్గొంటున్నారు. సాయంత్రం మల్కాజ్‌గిరిలో రోడ్ షోలో పాల్గొన్నారు. రేపు నాగర్‌కర్నూల్ బహిరంగ సభకు హాజరవుతారు. దేశంలోనే అతిపెద్ద పార్లమెంట్ సెగ్మెంట్ అయిన.. మల్కాజ్‌గిరిని కమలం ఖాతాలో వేసుకోవాలని ప్లాన్ చేసింది బీజేపీ. ఆ తర్వాత కర్నాటకలోని గుల్బర్గలో జరిగే బహిరంగ సభలో పాల్గొంటారు. ఇక ఎల్లుండి గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో జరిగే ఎన్డీయే బహిరంగ సభలో ప్రధాని మోదీ పాల్గొంటారు. వరుస పర్యటనలతో సౌతిండియాలోని రాష్ట్రాల్లో జోష్ పెంచుతున్నారు ప్రధాని మోదీ.దక్షిణ భారతంలో మొత్తం 130 లోక్‌సభ స్థానాలున్నాయి. వాటిలో కేవలం 29 సీట్లు మాత్రమే బీజేపీ ఖాతాలో వున్నాయి. వీటిలో ఎక్కువ స్థానాలు కర్నాటకలోనే వున్నాయి. దాంతో ఉన్నవాటిని కాపాడుకోవడంతోపాటు మిగిలిన 101 సీట్లలో కనీసం 50 సీట్లు కైవసం చేసుకోవాలని బీజేపీ నేతలు భావిస్తున్నారు. కర్నాటకలో ఈసారి బీజేపీ-జేడీఎస్ పొత్తుతో మొత్త 28 ఎంపీ సీట్లలో సగానిపైగా గెలవాలని గెలవాలని ప్లాన్ చేస్తోంది. ఏపీలోని 25, తెలంగాణలోని 17, తమిళనాడులోని 39, కేరళలోని 20 ఎంపీ సీట్లు కలిపితే 91 పార్లమెంటు సీట్లలో బీజేపీ మెజార్టీ సీట్లు గెలిచేలా వ్యూహాలు రూపొందించింది. తెలంగాణలో గత పార్లమెంట్ ఎన్నికల్లో 4 ఎంపీ సీట్లు గెలవగా..ఈ సారి 12 స్థానాలు గెలవాలని కమలనాథులు ప్లాన్ చేస్తున్నారు. ఇక ఏపీలో ఎన్డీయే కూటమి కనీసం 18కి పైగా స్థానాలు గెలవాలని భావిస్తోంది. తమిళనాడులో గతంలోకన్నా? అణ్ణామలై పాదయాత్రతో కాస్తా మెరుగుపడ్డా బీజేపీ, మిత్రపక్షాలతో కలిసి ఎక్కువ స్థానాలు గెలవాలని ప్లాన్ చేస్తోంది. కేరళలో అక్కడ 45 శాతం వున్న మైనారిటీల మనసులు గెలుచుకునేందుకు బీజేపీ యధాశక్తి ప్రయత్నిస్తోంది. ఆ విషయంలో సక్సెస్సయితే అక్కడ రెండో, మూడో సీట్లు బీజేపీకి దక్కవచ్చని యోచిస్తోంది.బీజేపీ అంటే నార్త్ పార్టీ అని, సౌత్‌లో బలం లేదనే విపక్షాల విమర్శలకు చెక్ పెట్టేందుకు వ్యూహాత్మకంగా ముందుకెళ్తోంది. అందుకే, ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణాదిన పట్టు బిగించేందుకు పక్కా ప్రణాళికతో ఆపరేషన్ సౌత్‌ను రెఢీ చేశారు. అంతగా పట్టులేని దక్షిణాది రాష్ట్రాల్లో భారత ప్రధాని నరేంద్ర మోదీతో ప్రచారాన్ని హోరెత్తించాలని పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తోంది బీజేపీ.లోక్‌సభ ఎన్నికల్లో 400కి పైగా సీట్ల గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న బీజేపీ అందుకు తగ్గట్టుగానే కార్యాచరణ ప్రారంభించింది. ఎన్‌డీఏ కూటమిలోని పాత మిత్రులను తిరిగి చేర్చుకోవడంతో పాటు, వాటి సాయంతో దక్షిణాది రాష్ట్రాల్లో పాగా వేయాలని భావిస్తోంది. దక్షిణ భారతంలో ఒక్క కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో పెద్దగా బలం లేకపోవడం, విజయాలను రుచి చూడకపోవడంతో ఆ లోటును పూడ్చుకోవడానికి ప్రయత్నాలు చేస్తోంది బీజేపీ. అందులో భాగంగానే ప్రధాని మోదీ ఇవాళ్టి నుంచి మార్చి 19వ తేదీ వరకు ఐదు దక్షిణాది రాష్ట్రాల్లో 5 రోజుల పాటు సుడిగాలిలా పర్యటించి ప్రజలకు చేరువకానున్నారు. ఆపరేషన్ సౌత్‌లో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాల్లో పర్యటించి పలు బహిరంగ సభల్లో ప్రసంగించ నున్నారు మోదీ.కేవలం రాజకీయ ఆరోపణలే కాకుండా మోదీ పర్సనల్ చరిష్మాతో సౌత్‌లో కూడా బలపడాలన్నది కమలం పార్టీ టార్గెట్. ఇందులో భాగంగా వారం రోజుల కిందట కూడా కేరళ, తమిళనాడుల్ని రౌండప్ చేశారు మోదీ. తమిళనాడులోని కన్యాకుమారిలో జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఇదే వేదికపై శరత్‌కుమార్ దంపతులు మోదీని కలిశారు. ఈ సందర్భంగా వారసత్వ రాజకీయాలతో దేశానికి చేటు తప్పదంటూ స్టేట్‌మెంట్ ఇచ్చారు. తమిళనాడులో బీజేపీ అధికారంలోకి రాకపోయినా బీజేపీ మనస్సులో మాత్రం తమిళనాడు ఉందంటూ సెంటిమెంట్‌తో కొట్టారు.మొత్తంగా సౌత్‌పై ఫుల్ ఫోకస్ పెట్టారు ప్రధాని మోదీ. ఒక రాష్ట్రంలో పర్యటన పూర్తి చేసి, మరో రాష్ట్రానికి వెళ్లాలన్న విధానం కాకుండా ఒకేరోజున పక్కపక్క రాష్ట్రాల్లో సభలు ఉండేలా ప్రణాళికను రూపొందించారు.

# రష్యాలో ఎన్నికల తంతు!

ఆపద్ధర్మ ఏలుబడితో కలుపుకొని ప్రధానిగా, దేశాధ్యక్షుడిగా పాతికేళ్లనుంచి అవిచ్ఛిన్నంగా రష్యా అధికార పీఠాన్ని అంటిపెట్టుకునివున్న వ్లాదిమిర్ పుతిన్ మరోసారి సార్వత్రిక ఎన్నికల తంతుకు తెరలేపారు. మూడురోజులపాటు జరిగే ఈ ఎన్నికలు శుక్రవారం మొదలయ్యాయి. 14 కోట్ల 30 లక్షలమంది జనాభాగల రష్యాతోపాటు 2014లో అది దురాక్రమించిన క్రిమియా... 2022 నుంచీ దాని ఆక్రమణలోవున్న ఉక్రెయిన్‌లోని కొన్ని ప్రాంతాల్లో కూడా ఈ ఎన్నికలు జరుగుతాయి. ప్రభుత్వ మీడియా మినహా మరి దేనికీ చోటీయని రష్యాలో చిన్నపాటి అసమ్మతి వినిపించే ప్రయత్నం చేసినా పెద్ద నేరమవుతుంది. అందుకే ఎన్నికల ముందు నిర్వహించిన సర్వేలన్నీ పుతిన్‌కు 80 శాతం ప్రజల ఆమోదం వున్నదని చాటాయి. కనుక 71 యేళ్ల పుతిన్ మరోసారి విజయం సాధించి అయిదోసారి అధ్యక్షుడవుతారనీ, 2030 వరకూ ఆయనే పాలిస్తారనీ అందరికీ తెలుసు. ఈ ఎన్నికలు సక్రమంగా జరుగుతున్నాయని చెప్పటానికి నామమాత్రంగా ప్రత్యర్థులు కనబడతారు. కానీ వారెవరికీ ప్రజల్లో విశ్వసనీయత లేదు. ఒకప్పుడు దశాబ్దాలపాటు దేశాన్నేలిన కమ్యూనిస్టు పార్టీ ఏనాడో నామ మాత్రావశిష్టమైంది. ఆ పార్టీ తరఫున 75 యేళ్ల నికొలాయ్ ఖరిటోనోవ్ పోటీచేస్తున్నారు. 2004లో పుతిన్‌పై మొదటిసారి ఓడిన ఆయన్నే ఈసారి కూడా ఆ పార్టీ నిలబెట్టింది. ఎటూ గెలవని ఎన్నికల కోసం మరొకరిని ముందుకు తోయటం అనవసరమని ఆ పార్టీ భావించివుండొచ్చు. లిబరల్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి లియోనెడ్ స్లట్‌స్కీ... పుతిన్ మాదిరే జాతీయవాది. ఆయన గెలుపే తన గెలు పని స్లట్‌స్కీ ఇప్పటికే ప్రకటించారు. ఉదారవాదిగా ముద్రపడి ఉక్రెయిన్‌లో 'శాంతి' నెలకొనాలని తరచు చెప్పే న్యూ పీపుల్ పార్టీ అధినేత వ్లాడిస్లావ్ దవాన్‌కోవ్‌ది కూడా అదే తీరు. ఇక ఉక్రెయిన్‌తో తలపడటాన్ని తప్పుబట్టిన చరిత్రగల ఇద్దరు అభ్యర్థులను అధికారులు 'అనర్హులుగా' తేల్చారు. చాలా దేశాలకు ఇది ఎన్నికల నామ సంవత్సరం. ఇప్పటికే బంగ్లాదేశ్, తైవాన్ ఎన్నికలుపూర్తయ్యాయి. మన దేశంతోపాటు అమెరికా, బ్రిటన్, దక్షిణాఫ్రికా, ఇండొనేసియా తదితర 60 దేశాల్లో ఈ



ఏడాదంతా వేర్వేరు నెలల్లో ఎన్నికలుంటాయి. ఈ ఎన్నికల్లో దాదాపు 200 కోట్లమంది ఓటు హక్కు వినియోగించుకుంటారు. అంటే ప్రపంచ జనాభాలో నాలుగోవంతన్నమాట! అయితే విజేతలై గద్దెనెక్కేవారు ప్రజాస్వామ్యబద్ధంగానే పాలిస్తారా అన్నది వేరే సంగతి. ఎందుకంటే ప్రజా స్వామ్యం ముసుగేసుకున్న నియంతలూ, సమాజంలో పరస్పర వైషమ్యాలు రెచ్చగొట్టే నేతలూ, గాలి కబుర్లతో గద్దెనెక్కాలనుకునేవారూ ఈ దేశాలన్నిటా వున్నారు. కానీ పుతిన్ మాదిరి బరితెగించిన నేత ఎక్కడా కనబడరు.

క్రితంసారి ఎన్నికలకన్నా ఎక్కువ పోలింగ్ అయిందనీ, పుతిన్‌కు అధిక శాతం మద్దతు లభించిందనీ 'నిరూపించటానికి' అధికారగణం ఎక్కడలేని పాట్లూ పడుతూవుంటుంది. 2018 ఎన్నికల సమయంలో పోలైన ఓట్లలో పుతిన్‌కు 5 కోట్ల 60 లక్షల ఓట్లులభించాయి. కనుక ఈసారి అది ఆరు కోట్లు దాటాలన్నది వారి పట్టుదల. తమ అధీనంలోని ఉక్రెయిన్ భూభాగంలో 45 లక్షలమంది ఓటర్లున్నారని అధికారులు చెబుతున్నారు. కానీ నిత్యం బాంబుల వర్షం కురిసేచోట నిజానిజాలు నిర్ధారించేదెవరు? వారందరికీ ఆన్‌లైన్ వోటింగ్‌కు అవకాశం ఇచ్చామని అధికారులు ప్రకటించారు. కనుక రిగ్గింగ్ ఈసారి పాత రికార్డులు బద్దలుకొడుతుందని నిర్ధారణగా చెప్పవచ్చు. వారం పదిరోజుల్లో ఉక్రెయిన్ లెక్క తేల్చి, యుద్ధ విజేతగా చాటుకుని అధ్యక్ష ఎన్నికలకు వెళ్లాలని పుతిన్ తపించారు. కానీ 2022 ఫిబ్రవరిలో యుద్ధం మొదలైన నాటి నుంచీ రష్యాకు అడుగడుగునా అవరోధాలే. అమెరికా ఉక్రెయిన్‌కు భారీయెత్తున సైనిక, ఆర్థిక సాయం అందించటమే కాదు...'ఉక్రెయిన్ తర్వాత మీవంతే' అని నాటో కూటమి దేశాలను బెదరగొట్టి ఆ దేశం పక్షాన నిలబడేలా చేసింది. కనుక యుద్ధం రెండేళ్లుదాటి మూడోసంవత్సరంలోకి ప్రవేశించినా పుతిన్‌కు అక్కడ దారీ తెన్నూ కనబడటం లేదు. పైపెచ్చు ఆయుద్ధంలో రష్యా సైనికులు భారీ యెత్తున మరణిస్తుండటం, అత్యాధునిక ఆయుధాలు అక్కరకు రాకుండా పోవటం, ఉక్రెయిన్ డ్రోన్ దాడులను నిలువరించటంలో వైఫల్యం వంటివి ఆయనకు నిరాశ కలిగిస్తున్నాయి. కానీ ఆ యుద్ధం వల్ల పుతిన్‌కు జనాల్లో ఆమోదనీయత పెరిగిందని ప్రభుత్వ మీడియా ఊదరగొడుతోంది.

అయితే పుతిన్ ఏలుబడి నల్లేరు మీద నడక కాదు. 2006%--%08 మొదలుకొని రెండేళ్లనాడు మొదలైన ఉక్రెయిన్ దురాక్రమణ యుద్ధం వరకూ ఏదో పేరిట చెలరేగే నిరసనలు తలనొప్పిగానే వున్నాయి. అవినీతికి వ్యతిరేకంగా, హక్కుల ఉల్లంఘన, దురాక్రమణ యుద్ధాలను నిరసిస్తూ ఈ ఉద్యమాలు సాగాయి. అయితే పుతిన్ వాటన్నిటినీ అణిచేసి, జైళ్లు నింపారు. ప్రస్తుతం రాజకీయ ఖైదీల సంఖ్య 1,16,000 పైమాటే. దేశ పౌరుల్లో పుతిన్ పాలనపై తీవ్ర అసంతృప్తి వుంది. ప్రభుత్వ వ్యయంలో 40 శాతం యుద్ధానికే కేటాయించాల్సివస్తోంది. అయినా ఫలితం నాస్తి. నిరుడు జీడీపీ 3.6 శాతంగా నమోదై జీ%--%7 దేశాలను అధిగమించింది. రక్షణరంగ పరిశ్రమలు మాత్రమే పచ్చగా వర్ధిల్లుతున్నాయి. అమెరికా ఆంక్షల పర్యవసానంగా దేశంలో అనేక వ్యాపార ఈసంస్థలు కుప్పకూలి మూతబడ్డాయి. వాస్తవాదాయాలు పడిపోయి, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటి పౌరులు సతమతమవుతున్నారు. దానికితోడు అంతర్జాతీయంగా ఏకాకులమయ్యామన్న అసంతృప్తి అదనం. కానీ అధ్యక్ష ఎన్నికల్లో వీటి ప్రభావం కనబడనీయకపోవటం పుతిన్ ప్రత్యేకత. ఈ రీతి, రివాజు ఎన్నాళ్లు కొనసాగుతుందో, నిజమైన ప్రజాస్వామ్యం రష్యాలో ఎప్పుడు చిగురిస్తుందో చూడాలి.

## జీవితమంతా సాహిత్య తపస్సు చేసిన

# కోవెల సుప్రసన్నాచార్య

సర్వ మానవ చైతన్యాన్ని వ్యక్తం చేయటం కోసం, తాత్త్విక, ఆధ్యాత్మిక, మానవత, మౌలిక మూలాల పరిరక్షణ కోసం, ప్రగతిశీల ప్రభావమైన సాహిత్య వికాసం కోసం, దానికి తోడ్పడే భాషాలీలా విలాసాల అవగాహన కోసం, తన జాతి పరంపరాభివృద్ధి కోసం, సమగ్ర ఉజ్వలమైన దీప్తి కోసం అహరహం పరితపించే ఆంతరిక ప్రవృత్తి గల వారు ప్రతి శతాబ్దిలోనూ ఉంటారు. వ్యక్తిగతమైన కష్టనిష్ఠూరాలను, ఆర్థికపరమైన ఒడుదొడుకులకు, సంసారపరమైన అనేకానేక అవరోధాలకు, సంకుచిత మనస్సు కలిగిన వాళ్ల నుంచి నిరంతరం ఎదురయ్యే తీవ్రమైన వ్యతిరేకతలకు ప్రభావితం కాకుండా, ఆత్మశక్తితో, సత్సంకల్పంతో జీవితమంతా సాహిత్య తపస్సు చేసిన గొప్ప రచయితల్లో ఒకరు కోవెల సుప్రసన్నాచార్య. పితామహులు కోయిల్ కందాడై రంగాచార్యులు, మాతామహులు తంయాల లక్ష్మీనృసింహాచార్యుల శిష్యరికంలో రూపుదిద్దుకొన్న సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకుడు, వ్యాఖ్యాత, సంపాదకుడు కోవెల సుప్రసన్నాచార్య. సాహిత్య విమర్శపై 18 గ్రంథాలు, 27 కావ్యాలు, అనేక సంకలనాలు ఆయన వెలువరించడం విశేషం. వ్యాకరణ, ఛందో గ్రంథాలను, విమర్శలను, ఖండకావ్యాలను, సాహిత్య చరిత్రను రాసిన ప్రముఖ కవి డాక్టర్ కోవెల సంపత్కుమారాచార్య ఆయనకు చిన్నాన్న కావడం గమనార్హం. కోవెల సుప్రసన్నాచార్యులు తెలంగాణలోని వరంగల్‌లో 1936 మార్చి 17న వెంకట నరసింహాచార్యులు, లక్ష్మీనరసమ్మ దంపతులకు జన్మించారు. తొమ్మిదేండ్ల వయసులోనే కందపద్యాలు రాయడం ప్రారంభించారు. 1959లో హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి తెలుగు సాహిత్యంలో ఎంఏ పూర్తి చేసి, 1962లో 'రామరాజ భూషణుని కృతులు %--% పరిశీలన' అనే అంశంపై జరిపిన పరిశోధనకు అదే వర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. అనంతరం ఉస్మానియా, వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయాల్లో వివిధ హోదాల్లో సేవలందించారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉన్నత విద్యామండలి సభ్యుడిగా కూడా పని చేశారు. 1987 నుంచి ఆలిండియా ఓరియెంటల్ కాన్ఫరెన్స్‌కు జీవితకాల సభ్యుడిగా ఉన్నారు.



తన సుదీర్ఘమైన కెరీర్‌లో 20 మంది పరిశోధక విద్యార్థులు పీహెచ్‌డీలు, 16 మంది ఎంఫిల్స్‌ను ఆయన మార్గదర్శనంలో పొందారు. వివిధ విశ్వవిద్యాలయాల అకాడమీలు నిర్వహించిన అనేక సెమినార్లలో పాల్గొని తెలుగు సాహిత్యంలో వివిధ అంశాలపై 2 వేలకు పైగా పరిశోధన పత్రాలను ఆయన సమర్పించారు. తెలుగు సాహిత్యాన్ని, సంస్కృతిని సుసంపన్నం చేయడానికి ఆయన చేసిన ఎనలేని కృషిని గుర్తించిన సాహితీ లోకం అనేక అవార్డులతో సత్కరించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి 1987లో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, 1955లో తెలంగాణ అక్షరాస్యత వేదిక వారి ఉత్తమ కవితా పురస్కారం, 1971లో సాహిత్య వివేచన (అక్షరాస్యత విశ్లేషణ) పుస్తకానికి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ నుంచి ఉత్తమ విమర్శ పురస్కారం, 1997లో తెలుగు వర్సిటీ నుంచి ఉత్తమ పరిశోధక అవార్డు, 2010లో 'అంతరంగం' అనే గ్రంథానికి కేంద్ర సాహిత్య అకాడమీ ఠాగూరు సాహిత్య పురస్కారం, 2013లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి హంస (కళారత్న) పురస్కారం, 2016లో తెలంగాణ ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ పురస్కారం తదితర అవార్డులు ఆయనను వరించాయి. కోవెల సుప్రసన్నాచార్య కవితల్లో కొన్నిటిని ఆంగ్లం, హిందీ భాషలలోకి పలువురు సాహితీవేత్తలు అనువదించడంతో అవి ఆయా భాషల్లో ప్రచురితమయ్యాయి. ఆయన రచనలపై విమర్శకులు, రిసెర్చ్ స్కాలర్స్, సాహితీవేత్తలు అనేక పుస్తకాలు ప్రచురించారు. ఉదాహరణకు 'ప్రసన్న శారద' (60వ జన్మదిన సంపుటి), 'సుప్రసన్న సాహితీ వైజయంతి' పుస్తకాలు ఆ కోవలోనివే. ఆయన 80వ జన్మదినం సందర్భంగా 'సన్నుతి' పేరిట ప్రత్యేక సంచికను ఆయన శిష్యులు, అభిమానులు వెలువరించారు. ఇప్పటికీ ఆయన రచనలపై వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఫిల్స్, పీహెచ్‌డీల కోసం పరిశోధనలు కొనసాగుతున్నాయి. వ్యక్తిత్వం వికసించే దశలో ఉండగానే ఆర్యసమాజ్ ఉద్యమాలతో ఆయన ప్రభావితుడయ్యారు. ఏ ఉద్యమంలోనూ ఆయన ప్రత్యక్షంగా పాల్గొనలేదు. కానీ, దేశంలోని సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ధోరణులను గమనించడం ద్వారా తన జీవిత దృక్పథాన్ని లోతుగా మలుచుకున్నారు. శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానంద, శ్రీఅరవిందులు, గాంధీజీ తదితర ప్రముఖుల రచనలు ఆయనలో చైతన్యాన్ని రగిలించి, ప్రభావితం చేసి.. జాతి నిర్మాణంలో నిబద్ధతతో కూడిన దార్శనిక కవి, విమర్శకుడిగా, రచయితగా ఎదగడానికి దోహదపడ్డాయి. ఒకానొక దశలో మార్క్సిస్టు భావజాలం, వామపక్ష ఉద్యమాల ప్రభావానికి ఆయన లోనయ్యారు. కానీ, అరవిందులు, విశ్వనాథ సత్యనారాయణల స్ఫూర్తి, రచనలు ఆయనలోని చైతన్యాన్ని చుట్టుముట్టి దార్శనికత కలిగిన గొప్ప రచయితగా మార్చాయి. 'శతాంకురలో నా కవితలు నూతన యుగానికి ఆధార భూమికలు' అని ఆయన పేర్కొన్నారు. తన కవిత్వం సమకాలీన కాలం నుంచి ప్రేరణ పొంది శాశ్వత విలువలను ప్రచారం చేసి భవిష్యత్తును చూస్తుందని దాని భావం.


జాతీయత, ప్రజాస్వామ్యం, సంప్రదాయ విలువలు, ఆధ్యాత్మిక స్ఫూర్తిని ఆయన ప్రచారం చేశారు. ఆయన దృష్టిలో మతం అంతిమ విషయం కాదు, మానవ పురోగతి సాధనలో అది ఒక మైలురాయి మాత్రమే. అంతిమ సత్యాన్ని సాధించడానికి మానవుడు మతతత్వాలకు పరిమితం కాకూడదు. మత సిద్ధాంతాల తాత్త్విక కట్టుబాట్లు, సిద్ధాంతాల అడ్డంకులను నాశనం చేయడం ద్వారా మనిషి ఎదగాలి. మానవాళి, ప్రకృతి, జంతువులు, విశ్వం పట్ల తన ప్రేమను మానవుడు విస్తరించాలని ఆయన స్పష్టంగా సూచిస్తారు. ఈ ప్రక్రియలో తన పరిమితులను, స్వార్థాన్ని, బలహీనతలను జయించిన మానవుడు అంతిమంగా సమాజాన్ని, ప్రకృతిని, విశ్వాన్ని ఆలింగనం చేసుకుని అందరితో ఏకమవుతాడు. సుప్రసన్న కవితా రచనలన్నిటికీ జీవితం కేవలం భౌతిక అస్తిత్వం కాదు. అదొక సమగ్ర జీవనం. జీవితం ఒక నిత్య గ్రంథం అని శతాంకురలో ఆయన చెప్పారు. రచనలన్నింటిలోనూ తనదైన భావ వ్యక్తీకరణ పద్ధతిని ఆయన పెంపొందించుకున్నారు. ప్రతి కవితా రచనలో భాష, శైలి, ఛందస్సు వంటి పద్ధతులను అవలంబించారు. ఆయన కవిత్వం ద్వారా పాఠకుడు గొప్పదనాన్ని, లోతైన అనుభవాన్ని, ఊహాశక్తిని అనుభూతి చెందగలడు. సుప్రసన్న కవిత్వానికి మానవ జీవితం సామాన్య సమీకరణం కాదు. ఇది ప్రతి వ్యక్తి తన సొంత మార్గంలో చేయవలసిన సంక్లిష్టమైన శాశ్వత ప్రయాణం. అందుకే ఆయనకు 'జీవితమే నా జెండా'. మనిషి జీవితాన్ని పట్టుదలతో పూర్తిగా అనుభవించి, ఎలాంటి అవాంతరాలు లేకుండా పట్టుదలతో ఉండాలి. ఈ గొప్ప సత్యమే ఆయన మొత్తం సాహిత్య రచనలకు మూలం. అందుకే ఆయన కవితలలో జీవితం వెల్లివిరుస్తుంది. ఆయన కవిత్వం జీవిత పరిపూర్ణతను, ప్రకాశవంతమైన ఆత్మకు సంబంధించిన లోతైన భావాల అన్వేషణ, వేడుక. ఆయన కవిత్వం ఇంద్రియానుభూతికి అతీతంగా కొత్త పరిధులను తెరుస్తుంది.

# స్థానిక వార్తలు

## సాగర్ కెనల్లో మృతదేహం లభ్యం

**వాస్తవ నేస్తం,కోటగిరి:** మండలంలోని ఎక్లాస్ పూర్ గ్రామ శివారులో నిజాంసాగర్ కెనాల్ లో మృతదేహం లభ్యమైనది స్థానిక ఎస్సై సందీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నసురుల్లాబాద్ మండలం బస్వాయిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ సయ్యద్(83) శనివారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలలో గాలించగా నిజాం సాగర్ కెనాల్ వద్ద చెప్పులు చేతి కర్ర విడిచి కాలకృత్యాల కొరకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది కెనాల్ లో కొట్టుకొని వచ్చి ఎక్లాస్పూర్ గ్రామ శివారు వద్ద కెనాల్ మృతదేహం లభ్యమైందని ఎస్సై తెలిపారు. మృతుడి కుమారుడు చాంద్ పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల:** నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి'ని తెలంగాణ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ కార్పొరేషన్ చైర్మన్ గా నియమించిన సందర్భంగా ఆదివారం ఏర్గట్ల మండల కాంగ్రెస్ నాయకులు తన నివాసంలో కలిసి శాలువ కప్పి పుష్ప గుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో కష్టపడ్డ వారికి సముచితస్థానం దొరుకుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రవిరెడ్డి, రెబ్బస్ హరీశ్, సంసన్, రంజిత్, గజెంధర్, రమేష్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంటు ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం రద్దు

జిల్లా కలెక్టర్ ఎన్నికల అధికారి రాజర్షి షా



**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** జిల్లాలో పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ (కోడ్) ముగిసేంత వరకు ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి ప్రజావాణి కార్యక్రమ తేదీల వివరాలను ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత వెల్లడించడం జరుగుతుందని ప్రకటనలో పేర్కొన్నారు. కావున జిల్లాలోని ప్రజలు గమనించి ఎన్నికల కోడ్ ముగిసేంత వరకు కలెక్టర్ కార్యాలయమునకు రావద్దని ఆయన కోరారు.

## కాంగ్రెస్ పార్టీవి రౌడీ రాజకీయాలు.. కొప్పుల ఈశ్వర్ మండిపాటు

కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని నాశనం చేస్తుందని పెద్దపల్లి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు సాగు నీళ్లు ఇవ్వడం లేదని.. నీళ్లు లేకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. సాగు నీటి కోసం రైతులు రోడ్డెక్కుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలంలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో జడ్పీ చైర్మన్ పుట్ట మధుతో కలిసి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రౌడీ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. అదే బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు రాష్ట్రంలో ఫ్రెండ్లీ రాజకీయాలు చేశామని తెలిపారు. ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మరింత నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో ఆలోచనతో ఓటు వేయాలని.. బీఆర్ఎస్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు.

## విద్యుత్ షాక్‌తో రైతు మృతి.. మెదక్ జిల్లాలో ఘటన

**నిజాంపేట :** వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా నిజాంపేటలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బక్కొల్ల మల్లయ్య(44) రోజు మాదిరిగానే వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. గత రాత్రి బలమైన ఈదురు గాలులు వీచగా పొలం వద్ద ఉన్న హైటెన్షన్ వైరు తెగి పంట పొలం చుట్టూ ఉన్న ఇనుప తీగపై పడింది. ఇది గమనించని మల్లయ్య విద్యుత్ ప్రవహిస్తున్న తీగకు తగలడంతో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఎల్లవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మల్లయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సీఎం రేవంత్‌ని కలిసి ఆ నేతలపై ఫిర్యాదు చేస్తా

**హైదరాబాద్:** బొమ్మరాశి పేటలో కొందరు రికార్డ్స్ ట్యాంపరింగ్ చేసి భూములను కాజేశారని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు ఆరోపించారు. బొమ్మరాశి పేట, శామీర్ పేట మండలంలో 920 ఎకరాల భూముల కుంభకోణం జరిగిందని చెప్పారు. బొమ్మరాశి పేటలో బీఆర్ఎస్ నేతలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, మల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులతో పాటు మరి కొంతమంది భూములు ఉన్నాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబ సభ్యుల భూములు, ఫాం హౌజ్‌లు ఉన్నాయన్నారు. సర్వే నంబర్ 323నుంచి408 వరకు ఉన్న 1049 ఎకరాల భూములకు మీర్ రెహ్మత్ ఆలీతో పాటు మరో 6 మంది హక్కుదారులు అని చెప్పారు. ఈ భూమిని హక్కుదారుల నుంచి 1965లో మాజీ ఎంపీ బలరామకృష్ణ కొన్నారని తెలిపారు. బలరామకృష్ణ తన వారసుడు అమరేంద్ర బాబుతో పాటు మరో 20మంది పైన భూమిని రిజిస్టర్ చేశారని చెప్పారు. వీరంతా వివిధ కారణాల రీత్యా విదేశాల్లో స్థిరపడ్డారని.. దీంతో కొందరు ఈ భూములపై కన్నేశారని మండిపడ్డారు. ఎవరైతే బాధితులు ఉన్నారో వారికి సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని చెప్పారు. నిజమైన హక్కుదారుల రికార్లను మాయం చేసి.. ఫేక్ డాక్యుమెంట్స్ సృష్టించారని ధ్వజమెత్తారు. ఈ భూమిని ఆక్రమించిన వారిలో కొంతమంది అధికారులు ఉన్నారని.. వీరందరూ తెలంగాణ హై కోర్ట్‌ను కూడా తప్పుదోవ పట్టించారని చెప్పారు. కోర్టులో కూడా కేసు నడుస్తుందని... కోర్టుకు కూడా ఫేక్ డాక్యుమెంట్స్ ఇచ్చారని చెప్పారు.

# ఘనంగా కోదండ రామాలయ పునః నిర్మాణ కార్యక్రమం





**వాస్తవ నేస్తం,కోదాడ:** పట్టణంలోని శ్రీ కోదండ రామాలయ పునః నిర్మాణ కార్యక్రమాలు శనివారం నుండి మొదలయ్యాయి. రెండవ రోజైన ఆదివారం సీత లక్ష్మణ సమేత శ్రీ కోదండ రాముడు, అన్నపూర్ణ సమేత బోలాలింగేశ్వర స్వామి, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు, వేంకటేశ్వర స్వామి, శ్రీకృష్ణుడు తదితర దేవుళ్ళ విగ్రహాలకు వేద పండితులు సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని బొడ్రాయి నుండి మహిళలు బిందెలతో జలాన్ని తీసుకొని శోభాయాత్రగా రామ్మూర్తి నగర్ లోని యాగశాల వద్దకు దేవుళ్ళ విగ్రహాలకు జలదివాసం కన్నుల పండుగగా నిర్వహించారు. వేద పండితులు బొర్ర వాసుదేవాచారయులు ఆధ్వర్యంలో పుణ్యా హవాచనం, రక్షాబంధన్, అగ్ని మధనం, అగ్నిప్రతిష్టాపన, జలాధిహోసనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. యాగశాలలో ఏర్పాటుచేసిన హోమ గుండాల వద్ద 200కు పైగా జంటలు హోమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతిష్ట చేయబోయే దేవుళ్ళ విగ్రహాలకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై జలాభిషేక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ధర్మకర్తలు నాగు బండి రంగా, నాగు బండి రంగనాథ్, నందగోపాల్, అరవింద్, ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# నేటి నుండి పదవతరగతి పరీక్షలు

- కోదాడ డివిజన్ లో 17 పరీక్ష కేంద్రాలు
- పరీక్షకు హాజరుకానున్న 3285 మంది విద్యార్థులు
- పరీక్షా కేంద్రంలో సెల్ ఫోన్ అనుమతి లేదు



**వాస్తవ నేస్తం,కోదాడ:** నేటి నుండి ప్రారంభమయ్యే పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు కోదాడ డివిజన్ లోని పరీక్షా కేంద్రాలలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు విద్యాధికారి సలీం షరీఫ్ పేర్కొన్నారు. కోదాడ, చిలుకూరు, అనంతగిరి, మునగాల, నడిగూడెం మండలాల్లో 17 సెంటర్లలో మొత్తం 3285 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానునట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 1715, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు 1570 మంది హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. మండలాల వారీగా కోదాడ మండలంలో 17 ప్రభుత్వ పాఠశాలలు, 26 ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయన్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుండి 656 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల నుండి1442 విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. కోదాడ పట్టం, మండల పరిధిలో మొత్తం 10 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు . అనంతగిరి మండలంలో ఏడు ప్రభుత్వ పాఠశాలల నుండి 197 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు తెలిపారు. అనంతగిరి మండలంలో ప్రవేట్ పాఠశాలలు లేవని మొత్తం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులేనని వీరిలో సగం మంది త్రిపురవరం సెంటర్ లో మిగతావారు కోదాడ సెంటర్లలో పరీక్షకు హాజరు కానునట్లు తెలిపారు. నడిగూడెం మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలలు ఒక ప్రైవేట్ పాఠశాల ఉందని వీటిలో ప్రభుత్వ పాఠశాలల నుండి 310 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి ఆరుగురు విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. నడిగూడెంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మునగాల మండలంలో 11 ప్రభుత్వ పాఠశాలలు 4 ప్రైవేట్ పాఠశాలల ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలల నుండి 297 మంది విద్యార్థులు, ప్రైవేట్ పాఠశాలల నుండి 54 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానునట్లు తెలిపారు. మునగాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చిలుకూరు మండలంలో ఎనిమిది ప్రభుత్వ పాఠశాలలు ఒకటి ప్రైవేట్ పాఠశాల ఉందని ప్రభుత్వ పాఠశాలల నుండి 255 మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాల నుండి 68 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. చిలుకూరు మండలంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరిన్డెంట్, డిపార్ట్మెంట్ అధికారి ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ ను నియామకం చేసినట్టు తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎవరికీ సెల్ ఫోన్ అనుమతి లేదని అధికారులకు కూడా సెల్ ఫోన్ అనుమతి లేదని చెప్పారు విద్యార్థులు భయాందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.

# పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలి

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరు పాటించాలి
- ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదుల టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఏర్పాటు

**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్:** పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సందర్భంగా ఆదివారం ప్రెస్ మీట్ ను జిల్లా పాలనాధికారి రాజర్షి షా, ఎస్పి గౌస్ ఆలం, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి లతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి కోరారు. భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్ కు రెండు కిలోమీటర్ల రేడియస్ లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని అన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎంసీసీ, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎంసీ ఎంసీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. జిల్లా కలెక్టరేట్లో ఫిర్యాదుల స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సి -విజల్ యాప్ లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదు పై చర్యలు తీసుకుంటారని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్లేస్ లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కరపత్రాలు,





ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదేవిధంగా ఎవరు ప్రింట్ చేయమన్నారు వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎస్పీ గౌస్ ఆలం మాట్లాడుతూ.. భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర 6 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదు తో ప్రయాణించవద్దని, ప్రతిరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లా లో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు.

# ప్రెగ్నెన్సీలో ఉండకూడని డేంజర్ లక్షణాలు



ప్రెగ్నెన్సీ టైమ్‌లో అన్ని విధాలుగా జాగ్రత్తలు తీసుకోవాలి. గర్భధారణ సమయంలో స్త్రీ శరీరంలో అనేక మార్పులు జరుగుతాయి. ఈ మార్పుల మధ్య ఒత్తిడి, కోపం, వంటి లక్షణాలు స్త్రీలో తరచుగా కనిపిస్తాయి. ఈ లక్షణాలు తక్కువగా ఉంటే పర్వాలేదు. కానీ అవి మరింతగా పెరిగితే డిప్రెషన్‌లోకి వెళుతారు. ఈ మానసిక ఒత్తిడి కొన్ని వారాలు, నెలలపాటు కొనసాగుతుంది. కానీ అది తీవ్రంగా మారితే తల్లి, బిడ్డ ఇద్దరికీ ఇబ్బందిగా మారుతుంది. దీంతో పాటు పిల్లల శారీరక, మానసిక ఎదుగుదలపై ప్రభావం పడుతుంది. ముఖ్యంగా ప్రెగ్నెన్సీ లో ఉన్నప్పుడు ఈ 10 డేంజర్ లక్షణాలు మాత్రం కనిపించకూడదు.

**1. పీరియడ్స్ అవ్వడం:** గర్భం దాల్చినప్పుడు కొద్ది నెలలపాటు పీరియడ్స్ ఆగిపోతుంది. కానీ కొందరు మహిళల్లో మాత్రం గర్భం దాల్చిన తొలినాళ్లలో వెజినా నుంచి బ్లీడింగ్ కనిపిస్తుంటుంది. దాదాపు 20–30 శాతం మహిళల్లో లైట్ పింక్ లేదా డార్క్ బ్రౌన్ కలర్ లో స్రావం కనిపిస్తుంది. అలా గర్భం దాల్చిన తొలి నాళ్లలో స్వల్పంగా బ్లీడింగ్ కావడం అనేది సహజం. కానీ రక్తస్రావమైతే ముందు జాగ్రత్తగా డాక్టర్‌ను కలవడం మంచిది. గర్భం దాల్చిన 3–4 వారాల్లో లేదా సెక్స్ తర్వాత స్రావాలు కనిపించొచ్చు. కొన్నిసార్లు సాధారణ పరిస్థితుల్లోనూ బ్లీడింగ్ కావచ్చు. అలాగే కొంత మంది మహిళల్లో గర్భం దాల్చాక 6–12 రోజుల తర్వాత బ్లీడింగ్ జరగవచ్చు. కానీ ప్యాడ్స్ అవసరం అయ్యేంత స్రావం ఉంటే మాత్రం గర్భధారణ పోయిందని గమనించాలి. మొదటి మూడు నెలలు గడిచాక బ్లీడింగ్ కావడం ప్రమాదకరం. మూడు నెలల గర్భం తర్వాత స్వల్పంగా నైనా, ఎక్కువైనా.. బ్లీడింగ్ అయితే వెంటనే డాక్టర్‌ను కలవాలి.

**2. భరించలేని తలనొప్పి:** ప్రెగ్నెన్సీ టైమ్‌లో టెన్షన్ తలనొప్పి కూడా వేధిస్తుంది. దీని కారణంగా జర్వం, జలుబు, నిద్రలేమి, ఒత్తిడి, డిప్రెషన్, హార్మోన్ల మార్పులు, భుజాలు, మెడ, స్కాల్ప్, దవడల్లో కండరాలు బిగుతుగా ఉండటం వల్ల టెన్షన్ తలనొప్పి వస్తుంది. కనుక డాక్టర్ సలహాతో వ్యాయామం, వార్మప్ ఎక్సఅర్‌సైజ్, మసాజ్‌తో ఈ టెన్షన్ తలనొప్పుని తగ్గించవచ్చు.

**3. పొట్ట నొప్పి:** మహిళ గర్భం పొందిన తర్వాత రోజులు గడిచే కొద్ది యూట్రస్ పెద్దగా విస్తరించడం ప్రారంభం అవుతుంది. దీని వల్ల మలబద్ధకం, జీర్ణ సమస్యలకు కారణమవుతుంది. అయితే రెండు, మూడవ త్రైమాసికంలో ఇలాంటి లక్షణాలను ఏమాత్రం నిర్లక్ష్యం చేయడానికి లేదు.. అంతేకాదు పొట్ట ఉదరంలో నొప్పితో పాటు, రక్తస్రావం జరిగితే, పొట్ట ఉదరంలో తిమ్మిర్లు గా అనిపిస్తే , అది అబార్షన్ కు సంకేతం. గుర్తించి వెంటనే మీ గైనకాలజిస్ట్‌ను కలవాలి.

**4. మూత్రం పోయేటప్పుడు నొప్పి/ మూత్రం తక్కువ రావడం:** తరచూ మూత్ర విసర్జన చేయడం, దురద, యోనిలో మంటగా అనిపించడం వంటి లక్షణాలు కనిపించిన కూడా డాక్టర్‌ను కలిసి యూరిన్ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్ అయిందేమో చెక్ చేయించుకోవాలి.

**5. భరించలేని ఛాతి/వెన్నునొప్పి:** గర్భధారణ సమయంలో మహిళలు వచ్చే అనేక రకాల ఆరోగ్య సమస్యల్లో ఛాతీ నొప్పి, వెన్నునొప్పి సాధారణం. లోపల బేబి గ్రోథింగ్ అవుతున్న సమయంలో వెన్నులో నొప్పి మొదలవుతుంది. అందుకే ఛాతి నొప్పి వచ్చినప్పుడు మీరు వెంటనే బీపీని చెక్ చేసుకోండి. ఒకవేళ బీపీ పెరిగినా, తగ్గినా వెంటనే డాక్టర్లను సంప్రదించండి. గ్యాస్ వల్ల ఛాతి నొప్పి వస్తే.. ఇంటి చిట్కాల ద్వారా ఉపశమనం పొందొచ్చు. నిమ్మకాయ, నల్ల ఉప్పును నీటిలో కలుపుకుని తాగితే కాస్త రిలీఫ్ పొందుతారు. వెన్నునొప్పి భరించలేనంతగా ఉంటే మాత్రం డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.

**6. ముఖం,కాళ్లు, పొట్ట వాపు రావడం:** ప్రెగ్నెన్సీ టైమ్‌లో ప్రతి మహిళ శరీరంలో మార్పులు కచ్చితంగా జరుగుతాయి. శరీరం వాపుగా ఉంటుంది. అదే విధంగా ముఖం, కాళ్లు ఇలా కనిపిస్తుంటాయి. ముఖ్యంగా కాళ్ల వాపులు.. దీనికి అనేక కారణాలు ఉంటాయి. కొంతమంది స్త్రీలకు మూడు నెలలోనే కాళ్ల వాపులు ఉంటే.. మరికొంత మంది స్త్రీలకు ఏడు, ఎనిమిది నెలల్లో కాళ్ల వాపులు ఉంటాయి. ఇలా కాళ్ల వాపు ఉండడానే ఎడిమా అని అంటారు. అలాంటప్పుడు టైంకి నీరు తీసుకోవాలి. కానీ ఎక్కువగా తీసుకోవడం వల్ల పిండం అభివృద్ధికి కొద్దిగా కష్టంగా ఉంటుంది కనుక మోతాదులో తీసుకొండి.

**7. అరికాళ్ళు, అరచేతులు జిల రావడం:** ప్రెగ్నెన్సీ టైమ్‌లో మహిళలు ఛాతి మీద పొత్తి కడుపు మీద దురదలని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఒక్కొక్క సారి దురద ని కంట్రోల్ చేసుకోలేక పోతుంటారు. శరీరంలో జరిగే వివిధ మార్పుల వలన ఈ సమస్య కలుగుతుంది. బ్లడ్ సప్లై పెరగడం..స్కిన్ స్ట్రెచ్ అవడం..హార్మోన్ లో మార్పులు..పొడి చర్మం..చర్మం మారడం, చిన్న చిన్న స్పాట్ ఒంటిమీద రావడం. ఇలాంటి జరగడం మూలంగా దురద వస్తుంది.

## జీన్స్‌ప్యాంట్ ఎక్కువ బ్లూకలర్‌లోనే
# ఎందుకు ఉంటుందో తెలుసా?



నీ జీను ప్యాంటు చూసి బుల్లెమ్మా అనే సాంగ్ అందరూ వినే ఉంటారు. జీన్స్ అంటే యూత్‌లో మస్తు క్రేజ్ ఉంటుంది. ఎక్కడ చూసినా జీన్స్ ప్యాంట్ వేసుకొనే ఎక్కువగా కనిపిస్తారు. అయితే మీరు ఎప్పుడైనా గమనించరా? జీన్స్ ఎక్కువగా బ్లూ కలర్‌లోనే ఉంటుంది. మరి ఎందుకు ఇది బ్లూకలర్‌లోనే ఉంటుంది. దీనికి గల కారణాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. బ్లూకలర్ అనేది చాలా ఆట్రాక్టివ్‌గా ఉంటుదంట. ఈ రంగు జీన్స్ అనేది అన్ని డ్రెసెస్‌కు మ్యాచింగ్‌గా అనిపిస్తుందంట. దీన్ని వేసుకున్నప్పుడు చాలా మంది కంఫర్ట్‌గా ఫీలవుతారు. అందుకే జీన్స్‌ను బ్లూకలర్‌లో ముందుగా మార్కెట్‌లోకి తీసుకొచ్చారు. అయితే జీన్స్ నీలి రంగులో ఉండటానికి ఇంకో రీజన్ కూడా ఉన్నదంట. అది ఏమిటంటే? 19వ శతాబ్దంలో సులభంగా, చాలా తక్కువ ధరకు లభించే రంగు నీలి రంగు. ఆకాలంలో జీన్స్‌కు నీలి రంగు వేసి తయారు చేసేవారు. ఎందుకంటే? ఇది మన్నిక, దృఢత్వానికి ప్రసిద్ధి చెందింది. మొదట మైనర్లకు పని దుస్తులను తయారు చేయడానికి దీన్ని ఉపయోగించారు. ఇండిగో ఫెరా మొక్క నుండి ఈ కలర్ తీసుకునేవారు. దీనిని నీలిమందు మొక్క అని కూడా అంటారు. ఇది ఆ రోజుల్లో చాలా విరివిగా దొరికేది. దీంతో దీని వాడకం ఎక్కువైంది. నీలిమందు మొక్క నుంచి రంగు తీసి బట్టకు వేసినా పోకుండా ఉండేది. ఎక్కువగా వాషింగ్ చేసిన తర్వాత కూడా రంగు తగ్గిపోయేది కాదు. ఈ కారణాలతో కార్మికులు, మైనర్లలో బ్లూ జీన్స్‌ను ప్రముఖ ఎంపికగా మారిందంట. అలా బ్లూ కలర్ జీన్స్ పుట్టుకొచ్చింది.

# ఎక్కువగా అద్దం చూసుకోవడం రోగమా..!



ఆడవాళ్లకు అద్దానికి అభినాభావ సంబంధం ఉందంటూ కవులు ఊరికే చెప్పలేదు. ఎందుకంటే రోజు మొదలైంది అంటే చాలు.. వారి డే ను అద్ధంలో ముఖం చూసుకోవడంతో స్టార్ట్ చేస్తారు. అద్దంలో తమ అందాలను చూసుకుంటూ మురిసిపోతారు. ప్రపంచంలో మా కంటే అందగత్తెలు లేరు అని అద్దానికే అతుక్కుపోతారు. ఎక్కడికైనా వెళ్లాలంటే ఇక చెప్పాల్సిన అవసరం లేదు. గంటల తరపడి అద్దం ముందు నిలబడి రెడీ అవుతా ఉంటారు. అయితే.. ఈ మధ్య కాలంలో అమ్మాయిలే కాదు అబ్బాయిలు కూడా అద్దాలకు అతుక్కు పోతున్నారు. కానీ ఇలా ఎక్కువ సేపు అద్దంలో చూసుకునేందుకు ఇష్టపడుతున్నారా..! ఇది ఒక రకమైన జబ్బు అంటున్నారు నిపుణులు. తరచూ గంటలు గంటలు అద్దంలో చూసుకోవడం 'బాడీ డిస్మార్ఫిక్ డిజార్డర్' అనే రోగం అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ వ్యాధి భారీన పడిన వారు ఎక్కువగా అద్దాలకు అతుక్కుపోతారంట. ఈ వ్యాధి లక్షణాలు ఎక్కువగా మాణిక్ కంపల్సివ్ డిజార్డర్ (మానసిక వ్యాధి), డిప్రెషన్‌తో బాధపడే వారిలోనే ఉంటాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. వీళ్లు పదే పదే అద్దంలో తమను తాము చూసుకుంటూ మురిసిపోతారట. అంతే కాకుండా అందంగా కనిపించాలని ఆరాటపడుతారట. అందుకే వీళ్లు అద్దంలో ఎక్కువగా చూసుకుంటారని చెబుతున్నారు నిపుణులు. అలాగే శారీరక, మానసిక ప్రశాంతతను పొందడానికి కూడా చాలా మంది అద్దాలలో ఎక్కువగా నిమగ్నమైపోతారట. ఎందుకంటే.. ఈ బాడీ డిస్మార్ఫిక్ వ్యాధి ఉన్నవాళ్లు అద్దం ముందు నిలబడి చాలా రకాల యాంగిల్స్‌లో తమను తాము చూసుకుంటూ నేత్రానందాన్ని పొందుతారట. అయితే.. అద్ధంలో చూసుకోవడం అంత పెద్ద మానసిక వ్యాధా అని మీకు డౌట్ రావచ్చు. ఒక వ్యక్తి తన రూపంతో సరైన సంతృప్తి చెందనప్పుడు.. ఇలా ఎక్కువ సేపు ముస్తాబు చేసుకోవడం లేక తానే అందంగా ఉన్నాను అనుకుని సంతృప్తి పడటం లాంటివి చేస్తారట. లేదంటే వాళ్లకి అందంగా తీర్చుదిద్దుకునేలా ప్రయత్నిస్తారు. అందుకే వారు ఎక్కువ సేపు అద్దాలకు అతుక్కుపోతారు. ఇది కొన్ని కొన్ని సార్లు వారి మానసిక ఒత్తిడిని కూడా ఎక్కువ చేస్తుంది. అంతే కాదు చాలా మంది బాధలో ఉన్నప్పుడు, ఏడుస్తున్నప్పుడు కూడా అద్దాల ముందు కూర్చుని తమను తాము చూసుకుంటా ఉంటారు. అయితే.. అద్దంలో చూసుకోవడం అనేది ప్రతి ఒక్కరికి ఉండే కామన్ అలవాటు. కానీ ఇలా గంటలు కొద్ది చూసుకోవడం మాత్రం మాక్సిమస్ టీనేజ్ వయసులో ఉన్నవారిలో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయి. ముఖ్యంగా అబ్బాయిలతో పోల్చితే.. అమ్మాల్లో ఎక్కువగా 'బాడీ డిస్మార్ఫిక్ డిజార్డర్' లక్షణాలు ఉంటాయని చెబుతున్నారు నిపుణులు.

# మనం ఉపయోగించే పసుపు నిజమైనదేనా..?



భారతీయ వంటకాల్లో పసుపు చాలా ముఖ్యమైనది. పసుపును వంటతో పాటు ఆయుర్వేద వైద్యంలో కూడా ఉపయోగిస్తారు. అన్ని బ్రాండ్‌ల వెర్షన్‌లు ఇప్పుడు మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. సుగంధ ద్రవ్యాలు కూడా కలిసి ఉంటాయి. మసాలా దినుసుల బరువు , పరిమాణాన్ని పెంచడానికి వివిధ రకాల కల్తీలు కలుపుతున్నారు. ఈ మధ్య కాలంలో పసుపు కూడా కలుషితమైందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏది నిజమైన పసుపో? ఏది నకిలీ పసుపో అని తెలుకునేందుకు కొన్ని సూచనలు చేశారు. అవేంటో ఇక్కడ తెలుసుకుందాం.. నకిలీ పసుపును గుర్తించడానికి, ఒక గ్లాసు నీటిని తీసుకుని దానిలో ఒక చెంచా పసుపు వేసి బాగా కలపాలి. అది నకిలీ పసుపు అయితే, అది అడుగు భాగానికి వెళ్తుంది. నకిలీ పసుపు అయితే తేలినట్టు ఉంటుంది. పసుపు రంగు అయితే, ప్రకాశవంతంగా మారుతుంది. నకిలీ పసుపు పొడిని నీటిలో కలిపితే వెంటనే పాలిపోతుంది. మీ అరచేతిలో కొద్దిగా పసుపు వేసి, మీ మరొక చేతి బొటన వేలితో 10 నుండి 20 సెకన్ల పాటు రుద్దండి. పసుపు స్వచ్ఛంగా ఉన్నప్పుడు, అది మీ చేతులపై మరకలను వదిలివేస్తుంది. ఈ విధంగా మీరు కేవలం కొన్ని నిమిషాల్లో మీ ఇంట్లో నకిలీ పసుపును గుర్తించవచ్చు. ఒక గ్లాసు వేడి నీటిలో 1 టీస్పూన్ పసుపు కలపండి. కింద పసుపు పొడి చూస్తే అది నిజమైన పసుపు అని అర్థం. అయితే నీళ్లలో వేసిన వెంటనే రంగు మారితే మాత్రం అది మంచి పసుపు కాదని గుర్తించండి.

# షాపింగ్ చేస్తున్నారా?

షాపింగ్ చేయడం ఒక అవసరం మాత్రమే కాదు, అదొక క్యూరియాసిటీగానూ ఉంటుంది. అందుకే చాలామంది బయటకు వెళ్లి రకరకాల వస్తువులు, దుస్తులు కొనడానికి ఉత్సాహం చూపుతుంటారు. కొందరు తమకు షాపింగ్ చేయాల్సిన అవసరం లేకపోయినా ఫ్రెండ్స్ లేదా కొలీగ్స్‌తో కలిసి షాపింగ్‌కి వెళ్తుంటారు. అయితే షాపింగ్ చేయడం అనేది బడ్జెట్‌తో ముడిపడి ఉంటుంది. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బంది పడతారని, నిపుణులు చెప్తున్నారు. అందుకోసం ఏం చేయాలో సూచిస్తున్నారు.

**ముందుగానే బడ్జెట్ ప్లాన్:** మీరు షాషింగ్‌కు వెళ్లడానికి మందే ఒక ప్లాన్ చేసుకోవాలి. బడ్జెట్ నిర్ణయించుకోవాలి. మీరు నిర్ణయించుకున్నదానికంటే ఒక్క పైసా కూడా ఎక్కువగా ఖర్చు చేయకూడదు. అందులోనే అన్ని వస్తువులు తీసుకురావడానికి ట్రై చేయాలి. కంపెనీలు, ఆన్‌లైన్‌లో ఉండే ఆఫర్లను చూసి టెమిట్ కావ్వు. లిమిట్‌లో వచ్చే బెస్ట్ వాటిని కొనుగోలు చేసేలా ప్లాన్ చేసుకోవాలి.

**లిస్ట్ రెడీ చేసుకోండి:** కొందరు ఇంట్లో ఉన్నప్పుడు ఏవేవో కొనాలని అనుకుంటారు. తీరా అక్కడికి వెళ్లే సరికి మర్చిపోతుంటారు. అందుకని షాపింగ్ వెళ్లేటప్పుడు ముందుగానే కావాల్సిన వస్తువులు సీరియల్ నెంబర్ ప్రకారం లిస్టు రెడీ చేసుకోండి. పేపర్ రాసి మీ ఫోన్ ద్వారా ఫొటో తీసుకొని కూడా వెళ్లొచ్చు. చాలామంది రిటైలర్లు వ్యూహాత్మకంగా క్యాష్ అండ్ చెక్ అవుట్ కౌంటర్ల వద్ద ఆకర్షణీయ వస్తువులను ప్రదర్శనలో ఉంచుతారు. వాటిపై దృష్టి కేంద్రీకరించకపోవడమే మంచిది. లిస్ట్‌లో రాసుకున్నవాటినే కొనుగోలు చేయడం వల్ల మీకు టైంతోపాటు బడ్జెట్ ఆదా అవుతుంది.

**రేట్లను పోల్చి చూసుకోండి:** ధరల విషయంలో కొందరు ఇబ్బంది పడుతుంటారు. ఇలా జరగవద్దనుకుంటే షాపింగ్ చేసేటప్పుడు వివిధ షాపులలో, ఆన్‌లైన్‌లో ఉండే వస్తువుల ధరలను పోల్చి చూడాలి. దీనివల్ల మీకు కావాలసిన వస్తువులు కొనుగోలు చేస్తున్నవద్ద ఏ రేటుకు లభిస్తున్నాయి. మరోచోట తక్కువకు ఏమైనా లభిస్తాయా? అనేది తెలిసిపోతుంది. పెద్ద పెద్ద దుకాణాల్లో, ఆన్‌లైన్ రిటైలర్స్ వద్ద కొన్నిసార్లు స్పెషల్ ఆఫర్లు ఉంటాయి. ఎక్కువ కొనుగోలు చేసినప్పుడు డిస్కౌంట్స్ మరింతగా ఉండొచ్చు. కాబట్టి, ధరల విషయంలో వివిధ షాపుల రేట్లను పోల్చి చూసుకోవడం బెటర్ అంటున్నారు నిపుణులు.

ఎక్కువగా కొనాలనుకుంటే ..: తక్కువ వస్తువులు అయినప్పుడు ఎక్కడైనా కొన్నా ఇబ్బంది అనిపించకపోవచ్చు. కానీ కొన్ని రకాల వస్తువులు పెద్ద మొత్తంలో అవసరమైతే రిటైల్ షాప్‌లో కాకుండా హెూల్‌సేల్ షాపులలో కొనుగోలు చేయడం బెటర్. దీనివల్ల బడ్జెట్ ఆదా అవుతుంది. ఇక చాలామంది షాపింగ్ సమయంలో డెబిట్ లేదా క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తారు. యూపీఐ చెల్లింపులు చేస్తారు. దీనివల్ల ఎంత చెల్లిస్తున్నామో తెలియకుండా పోతుంది. అందుకే షాపింగ్‌కు వెళ్లేటప్పుడు ముందుగానే నిర్ణయించుకున్న మేర నగదను తీసుకెళ్లడం బెటర్.



# శత్రు సైన్యానికి చెక్ పెట్టేలా.. రంగంలోకి దిగిన మస్క్



అపర కుబేరుడు, టెస్లా సీఈవో ఎలోన్ మస్క్ అమెరికా మిలటరీ విభాగంలో అత్యంత కీలకంగా మారారు. ఇప్పటికే ప్రపంచంలోనే పలు దేశాలకు శాటిలైట్ ఇంటర్నెట్ సేవల్ని అందిస్తున్న ఆయన తాజాగా అమెరికా సైన్యానికి స్పేస్ ఎక్స్ స్పై శాటిలైట్‌లను తయారు చేసే పనిలో పడ్డారు.
రాయిటర్స్ నివేదిక ప్రకారం.. మస్క్ నేతృత్వంలోని స్పేస్‌ఎక్స్ స్పై శాటిలైట్ కార్యకలాపాలు నిర్వహించే అమెరికా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ యూఎస్ నేషనల్ రికనైసెన్స్ ఆఫీస్ (ఎన్ఆర్ఓ)తో కలిసి వందలాది స్పై శాటిలైట్‌లను నిర్మిస్తున్నారు. 2021లో స్పేస్ టెక్ దిగ్గజం , ఎన్ఆర్ఓల మధ్య 1.8 బిలియన్ల భారీ ఒప్పందం కుదిరింది. ఒప్పందంలో భాగంగా స్పేస్‌ఎక్స్ స్టార్‌షీల్డ్ బిజినెస్ యూనిట్ ఈ స్పై శాటిలైట్లను తయారు చేస్తోంది.

**స్పై శాటిలైట్ల వల్ల ఉపయోగం**

అమెరికా ఇంటెలిజెన్స్, ఆర్మీ నిర్వహించే పలు ప్రాజెక్ట్‌లలో స్పేస్ ఎక్స్ తయారు చేస్తున్న స్పై శాటిలైట్‌లు కీలక పాత్ర పోషించనున్నాయి. ముఖ్యంగా ప్రత్యర్థి దేశాలు నిర్వహించే అణు పరీక్షలను గుర్తించడం, సైనికుల పహారా, బాంబుల వల్ల కలిగే నష్టాన్ని అంచనా వేయడం, శత్రు సామర్థ్యం గురించి పసిగట్టడంలో ఈ స్పై శాటిలైట్‌లు పనిచేస్తాయి. ఇలా శత్రు సైన్యాలు ఎత్తుల్ని ముందే పసిగట్టి అమెరికా ఇంటెలిజెన్స్‌కు సమాచారం అందిస్తాయి.

**మిలటరీ సామ్రాజ్యాన్ని పటిష్ట పరిచేలా**

మస్క్ నిర్వహిస్తున్న ఈ కీలక ప్రాజెక్ట్ విజయవంతమైతే అగ్రరాజ్యం అమెరికా ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల సైనికుల కదలికల్ని గుర్తిస్తుంది. తద్వారా మిలటరీ సామ్రాజ్యాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని భావిస్తోంది.

## ఏఐ విస్తరణతో మానవ పురోగతి

**అడోబ్ ఇండియా డైరెక్టర్ వేణుగోపాలన్**

ఏఐతో కొలువుల కోత తప్పదనే ఆందోళనల నడుమ అడోబ్ ఇండియా డైరెక్టర్ వేణుగోపాలన్ లేటెస్ట్ టెక్నాలజీపై కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో ఏఐ విస్తరించి, మానవుల పురోగతికి దారితీస్తుందని పేర్కొన్నారు. ఏఐతో ఎక్కువ మంది జాబ్ మార్కెట్‌లోకి రాగలుగుతారు.. ఇది సృజనాత్మకత ప్రజాస్వామీకరణకు దారితీస్తుందని అన్నారు. అదే సమయంలో ఏఐతో పని నాణ్యతను పెంపొందించడానికి నిపుణులకు వెసులుబాటు ఉంటుందని వేణుగోపాలన్ చెప్పారు. ఏఐని అర్థం చేసుకోవడం, దాన్ని స్వీకరించడం కీలకమని చెప్పారు. తద్వారా ఇది భవిష్యత్తులో వేగంగా ముందుకు సాగడానికి మిమ్మల్ని అనుమతిస్తుందని వేణుగోపాలన్ పేర్కొన్నారు. ఇక ఏఐ రాకతో ఉద్యోగులపై వేటు తప్పదని మరికొందరు నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఏఐతో కోడర్స్ ఉద్యోగాలు కనుమరుగవుతాయని ఎన్‌విడియా సీఈవో హ్వాంగ్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు టెకీల్లో గుబులు రేపాయి. ఇక ఏఐతో భారత్‌లో ఐటీ కంపెనీల రిక్రూట్‌మెంట్ 70 శాతం తగ్గుతుందని హెచ్‌సీఎల్ మాజీ సీఈవో పేర్కొన్నారు.

# అధిక రాబడి వస్తుందని వ్యాపారాల్లో పెట్టుబడి పెడుతున్నారా?

‘ట్రింగ్.. ట్రింగ్’ ఫోన్ మోగింది. ‘జమీందార్‌గారి అల్లుడు ఉన్నాడా?’ అని అడిగాడా అవతలి వ్యక్తి. ‘ఉన్నారు బాబు..’ అని అల్లుడుగారికి ఫోన్ ఇచ్చాడు పెద్ద పాలేరు. అప్పటిదాకా కులాసాగా ఉన్న ఆయనగారు ఫోన్‌లో మాట్లాడుతుండగానే దిగాలుగా ముఖం పెట్టేశాడు. ఉన్నపళంగా కుదేలయ్యాడు. నిల్చున్నచోటే కూలబడిపోయాడు. కారణం.. ఆ ఫోన్ చేసిన వ్యక్తి.. ‘సింగపూర్ నుంచి బయల్దేరిన సరుకు ఓడలు తుఫాన్ ధాటికి సముద్రంలో మునిగిపోయాయ’ని చావు కబురు చల్లగా చెప్పాడు. మామగారి ఆస్తిపై కూడా అప్పు చేసి పెట్టిన పెట్టుబడంతా కదలి పాలవ్వడంతో ఒక్క ఫోన్‌కాల్‌తో కోటీశ్వరుడు కాస్తా బికారిగా మారిపోయాడు. ఇలాంటి సన్నివేశాలు బ్లాక్ అండ్ వైట్ సినిమాల్లో చాలాసార్లు చూసే ఉంటాం. ఆగర్భ శ్రీమంతులైనా, నడమంత్రపు సిరి కలిసొచ్చినా ఐశ్వర్యం శాశ్వతం కాదన్న సత్యం గుర్తెరిగి ఉండాలి. ‘దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాల’న్న సామెత మర్చిపోతే.. దురదృష్టం వెంటాడిన నాడు అప్పటిదాకా అండగా ఉన్న అదృష్టం కూడా ముఖం చాటేస్తుంది. ఊహించని అద్భుతాలు జరిగితే నిరుపేద బతుకుల్లో, మధ్యతరగతి జీవితాల్లో రాత్రికి రాత్రి పెద్దగా మార్పులేం జరగవు. అదే మార్పు సిరిగలవాడింట చోటు చేసుకుంటే.. ఆ చేటును తట్టుకునే చేవ వారికి ఉండకపోవచ్చు. అలా జరగొద్దంటే గల్లా పెట్టెలో కాసులు గలగలలాడుతున్నా, బోషాణంలో ఏడువారాల నగలు నిగనిగలాడుతున్నా, ట్రంకు పెట్టెలో దస్తావేజులు దుమ్ముకొట్టుకుపోతున్నా అను క్షణం అప్రమత్తమై ఉండాల్సిందే! చిన్న ఏమరుపాటు వీటన్నిటినీ లాక్కెళ్లిపోయే ప్రమాదం ఉంది. ముప్పులు ముంచుకొచ్చే దాకా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తే.. స్వీయ పతనానికి నాంది పలికినట్టే!

**ఉద్యోగి సేఫ్..**

ఆదాయం ఎలా వస్తున్నదన్న దానిపైనే ఖర్చు ఆధారపడి



ఉండాలి. స్థిరమైన ఆదాయం అంటే%ౄ% ఉద్యోగార్జితమో, స్థిరచరాస్తుల ద్వారా సమకూరే సంపద ధైర్యాన్ని ఇస్తుంది. లక్షల్లో వేతనం వస్తున్న ఉద్యోగులు ఖర్చుల దగ్గర కాస్త తికమకపడ్డా కొంపలేం మునిగిపోవు. తొందరపాటుతో ప్రయోజనం లేని పెట్టుబడి పెట్టినా తప్పును సరిదిద్దుకునే అవకాశం ఉంటుంది. రూ.3 లక్షలు వేతనం పొందుతున్న కార్పొరేట్ ఉద్యోగికి ఈపీఎఫ్ కటింగ్ నెలకు రూ.40 వేల వరకు ఉంటుంది. అంటే నెలకు ఏదోరకంగా రూ.40వేలు పొదుపు చేస్తున్నట్టే కదా! కంపెనీ నుంచి ఇన్సూరెన్స్ ఉంటుంది. ఫ్యామిలీ హెల్త్‌కేర్ కవర్ ఉంటుంది. వాళ్లు ఇతర ఇన్వెస్ట్‌మెంట్లు భారీగా చేయకపోయినా ప్రమాదం ఏం ఉండదు. వచ్చిన జీతంలో ఓ ఇల్లు, కారు, రిటైర్మెంట్ ప్లాన్ చేసుకుంటే సరిపోతుంది. స్థిరమైన ఆదాయం లేనివాళ్లే తగు జాగ్రత్తలు తీసుకోవాలి.
కొందరి ఆదాయం స్థిరంగా ఉండదు. నక్కతోక తొక్కినట్టు ఏదో డీల్‌లో డబ్బు చేతికి అందినా.. ఆ సొమ్మును అవగాహనా రాహిత్యంతో వృథా చేస్తున్నవాళ్లే ఎక్కువ. కష్టం లేకుండా వచ్చే సొమ్ము తాత్కాలిక ఆనందాన్ని ఇచ్చినా, దీర్ఘకాలిక ప్రయోజనాన్ని చేకూర్చదు.

**తాత్కాలిక ఆనందాలొద్దు..**

వ్యాపారంలో ఊహించిన దానికన్నా అధిక రాబడే వస్తుంది. అయితే ఆ వ్యాపారం సంఘటిత రంగానికి సంబంధించినదైతే పెద్దగా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉండదు. అసంఘటిత రంగాల్లో పెట్టుబడులు పెడుతూ, అయాచితంగా లాభాలు పొందుతున్న వారి విషయంలోనే ఎప్పుడేం ఉపద్రవం వచ్చిపడుతుందో చెప్పలేం. కొన్నేండ్లుగా రియల్ ఎస్టేట్ రంగం ఊహించని పురోగతి సాధిస్తున్నది. కానీ, ఈ రంగాన్ని ఆశ్రయించిన వారందరూ అదే స్థాయిలో వృద్ధిలోకి వచ్చారా? అంటే స్పష్టమైన సమాధానం దొరకదు. కారణం, జీరో బడ్జెట్‌తో దందాలు చేస్తూ, కమీషన్ల మీద కాలం వెళ్లదీసే వాళ్లే ఎక్కువగా ఉంటారు. వీరి ఆదాయం స్థిరంగా ఉండదు. ఎప్పుడో నక్కతోక తొక్కినట్టు ఓ డీల్‌లో బలంగా డబ్బు చేతికి అందుతుంది. ఆ సొమ్మును అవగాహనా రాహిత్యంతో వృథా చేస్తున్నవాళ్లే ఎక్కువ మంది ఉంటారు! కష్టం లేకుండా వచ్చే సొమ్ము తాత్కాలిక ఆనందాన్ని ఇస్తుందేమో కానీ, దీర్ఘకాలిక ప్రయోజనాన్ని చేకూర్చదు. ఎలా సంపాదించిందీ పక్కన పెడితే%ౄ% మీ ఆదాయాన్ని సుస్థిరం చేసుకోవడానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఇందుకోసం స్థిరాస్తి కొనుగోళ్లు ఒకమార్గం! ఆస్తులు జాస్తిగా ఉన్నా.. అవసరానికి రూపాయి పుట్టాలంటే లిక్విడ్ అసెట్ రూపంలోనూ ఆస్తులు కూడగట్టాలి. ఆదాయంలో ముప్పయ్ శాతానికి తగ్గకుండా పిల్లలు, జీవిత భాగస్వామి పేరిట స్థిరచరాస్తులు సమకూర్చుకోవాలి. ఈ ముప్పయ్ శాతంలో సింహభాగం పాలసీలు, మ్యూచువల్ ఫండ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఇలా లిక్విడ్ అసెట్స్ రూపంలో సమకూర్చుకుంటే.. ఓడలు బండ్లయినా, రాత్రికి రాత్రి నసీబు మారిపోయినా.. ‘ఎంత చెట్టుకు అంతగాలి’ అని బ్లాక్ అండ్ వైట్ సినిమా డైలాగ్‌లు చెప్పాల్సిన పరిస్థితి రాదు.

# ఉద్యోగులకు బంపరాఫర్, జీతం ఎంత పెరగనుందంటే?

ఆర్థిక మాంద్యం భయాలు. ప్రాజెక్ట్‌ల కొరత, అవధుల్లేని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టూల్స్ వినియోగం, వరుస లేఆఫ్స్, వేతనాల కోతల వంటి సంస్థలు వరుస నిర్ణయాలతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రముఖ అకౌంటింగ్ సంస్థ డెలాయిట్ గుడ్‌న్యూస్ చెప్పింది. ‘డెలాయిట్ ఇండియా టాలెంట్ ఔట్‌లుక్ 2024’ నివేదిక ప్రకారం..ఆయా కంపెనీల్లో పని చేస్తున్న కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్‌లకు 9 శాతం శాలరీ పెరుగుతుందని అంచనా వేసింది. ఐటీ, బీపీఓలు మినహా అన్ని రంగాలలో కోవిడ్‌కు ముందు స్థాయిల కంటే మెరుగుగానే జీతాల పెంపు ఉంటుందని తెలిపింది. అయితే, ఈ అంచనా 2023లో వేసిన 9.2శాతం కంటే కొంచెం తక్కువగా ఉంది. కంపెనీలు జూనియర్ మేనేజ్‌మెంట్‌కు గణనీయమైన ఇంక్రిమెంట్‌లను అందించే అవకాశం ఉండగా.. ఉద్యోగుల పనితీరు ఆధారంగా వేతనాల చెల్లింపు ఉండనుంది.

**ఇంక్రిమెంట్లు**

డెలాయిట్ ఇండియా శాలరీ నివేదిక ప్రకారం.. టాప్ పెర్ఫార్మర్లు సగటు రేటెడ్ ఉద్యోగులకు చెల్లించే ఇంక్రిమెంట్ల కంటే 1.8 రెట్లు ఎక్కువ పొందే అవకాశం ఉంది. 2023లో 0.6 రెట్లుతో పోలిస్తే ఈ సంవత్సరం తక్కువ రేటింగ్ ఉన్న ఉద్యోగులు 0.4 రెట్లు పెరగనున్నారు.

**బోనస్‌లు**



2024లో దాదాపు సగం కంపెనీలు తాము నిర్దేశించుకున్న లక్ష్యాలకు మించి అదనంగా బోనస్‌లు ఇవ్వనున్నట్లు డెలాయిట్ ఇండియా నివేదిక హైలెట్‌చేస్తోంది. ప్రతిభ గల ఉద్యోగుల్ని నిలుపుకునేందుకు సంస్థలు 7.5శాతంతో ప్రమోషన్‌ల పెంపును కొనసాగించాలని కూడా భావిస్తున్నట్లు వెల్లడించింది. నివేదిక ప్రకారం, పదోన్నతులు పొందగలరని అంచనా వేసిన ఉద్యోగుల శాతం 2023లో 12.3శాతం నుండి తగ్గింది.

# 2844 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత!



మహిళల ఐపీఎల్ (డబ్ల్యూపీఎల్) 2024 ఎడిషన్‌లో భాగంగా ఇవాళ (మార్చి 17) జరిగే ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడనున్నాయి. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా ఈ మ్యాచ్ రాత్రి 7:30 గంటలకు ప్రారంభమవుతుంది. టేబుల్ టాపర్‌గా నిలిచి ఢిల్లీ క్యాపిటల్స్ ఫైనల్‌కు చేరుకోగా.. ఎలిమినేటర్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌ను చిత్తు చేసి ఆర్సీబీ ఫైనల్‌కు చేరింది. డబ్ల్యూపీఎల్‌లో ఫైనల్‌కు చేరడం ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఇది వరుసగా రెండోసారి కాగా.. ఆర్సీబీ తొలిసారి తుదిపోరుకు అర్హత సాధించింది. డబ్ల్యూపీఎల్ అరంగేట్రం సీజన్‌లో (2023) కేవలం రెండే విజయాలతో గ్రూప్ దశలోనే నిష్క్రమించిన ఆర్సీబీ.. ప్రస్తుత సీజన్‌లో గ్రూప్ దశలో నాలుగు విజయాలు, కీలకమైన ఎలిమినేటర్‌లో ముంబైపై విజయంతో మొత్తంగా ఐదు విజయాలు సాధించి ఫైనల్‌కు చేరింది. ఐపీఎల్ (2009, 2011, 2016), డబ్ల్యూపీఎల్ (2024), ఛాంపియన్స్ టీ20 లీగ్‌లతో (2011) కలిపి ఐదోసారి ఫైనల్‌కు చేరిన ఆర్సీబీ.. 2844 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత మరోసారి ఫైనల్‌కు చేరింది. ఆర్సీబీ చివరిసారిగా 2016 ఐపీఎల్ ఎడిషన్‌లో ఫైనల్స్ ఆడింది. నాటి ఫైనల్‌లో ఆర్సీబీ.. సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో





ఓటమిపాలైంది. దాదాపు ఎనిమిదేళ్ల అనంతరం ఆర్సీబీ మరోసారి ఫైనల్‌కు చేరింది. మరి ఈ సారి ఫైనల్లోనైనా ఆర్సీబీ విజయం సాధించి తమ టైటిల్ దాహానికి చెక్ పెడుతుందో లేదో వేచి చూడాలి.

## ఇమాద్ వసీం ఊచకోత.. పీఎస్ఎల్ ఫైనల్లో ఇస్లామాబాద్



పాకిస్థాన్ సూపర్ లీగ్ 9వ సీజన్‌లో ఇస్లామాబాద్ యునైటెడ్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠ రేపిన ఎలిమినేటర్ 2లో పెషావర్ జల్మీపై ఇస్లామాబాద్ జట్టు అద్భుత విజయం సాధించింది. ఆల్‌రౌండర్ ఇమాద్ వసీం(59 నాటౌట్: 40 బంతుల్లో 9 ఫోర్లు) అజేయ హాఫ్ సెంచరీతో ఇస్లామాబాద్‌ను గెలిపించాడు. భారీ ఛేదనలో ఒకదశలో ఓటమి అంచున నిలిచిన ఇస్లామాబాద్‌ను హైదర్ అలీ(52 నాటౌట్)తో కలిసి విజయ తీరాలకు చేర్చాడు. పెషావర్ బౌలర్లను ఉతికారేసిన ఇమద్, అలీలు జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లారు. ముల్తాన్ సుల్తాన్స్‌తో మార్చి 18 సోమవారం జరిగే టైటిల్ పోరులో ఇస్లామాబాద్ తలపడనుంది. కరాచీ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో బాబర్ సేన భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ సయీం ఆయూబ్(78), మహ్మద్ హ్యారిస్(40)లు చెలరేగడంతో నిర్ణీత ఓవర్లలో 185 రన్స్ కొట్టింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన షాదాబ్ ఖాన్ బృందం ఆదిలోనే పీకల్లోతు కష్టాల్లో పడింది. పెషావర్ బౌలర్ల ధాటికి 91 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. దాంతో, ఆ జట్టు ఓటమి ఖాయమనుకున్నారంతా. కానీ, ఇమాద్ పట్టువదలని యోధుడిలా పోరాడాడు. ఆజం ఖాన్(22) ఔటైనా హైదర్ అలీ(52 నాటౌట్)తో కలిసి చివరి దాకా నిలబడ్డాడు. 18 ఓవర్‌లో ఆఖరి బంతికి బౌండరీతో ఇస్లామాబాద్‌ను గెలిపించాడు.

# హైదరాబాద్‌లో వరల్డ్ కప్ హీరో.. ఆరెంజ్ ఆర్మీ స్టార్ల ఎంట్రీ అదిరిందిపో

ప్రపంచ క్రికెట్‌లో ఎంతో పాపులర్ అయిన ఐపీఎల్ కొత్త సీజన్ కోసం స్టార్ క్రికెటర్లు భారత్‌కు విచ్చేస్తున్నారు. విదేశీ ఆటగాళ్లంతా ఒక్కరొక్కరుగా తమ ఫ్రాంచైజీ హోటల్‌లో అడుగుపెడుతున్నారు. ఆదివారం ఉదయం సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ట్రావిస్ హెడ్ కూడా హైదరాబాద్ చేరుకున్నాడు. వరల్డ్ కప్ హీరోకు హోటల్‌లో ఘన స్వాగతం లభించింది. మాజీ కెప్టెన్ ఎడెన్ మర్క్‌రమ్, హెడ్‌కోచ్ డానియల్ వెటోరీ, హెన్రిచ్ క్లాసెన్‌లు సైతం ఆరెంజ్ ఆర్మీ క్యాంప్‌లో చేరారు. దాంతో, హైదరాబాద్ జట్టు ఇప్పుడు ఫుల్ జోష్‌లో ఉంది.

**సూపర్ సెంచరీతో..**

భారత్ ఆతిథ్యమిచ్చిన వన్డే వరల్డ్ కప్‌లో హెడ్ దంచికొట్టాడు. వాంఖడేలో టీమిండియాతో జరిగిన ఫైనల్లో సూపర్ సెంచరీతో ఆస్ట్రేలియాను గెలిపించాడు. అంతకుముందు డబ్ల్యూటీసీ ఫైనల్లోనూ హెడ్ రోహిత్ సేనపై శతకంతో కదం తొక్కాడు. విధ్వంసక ఇన్నింగ్స్‌లతో శుభారంభాలు ఇచ్చే ఈ స్టార్ ఓపెనర్‌ను హైదరాబాద్ కొనేసింది. నిరుడు దుబాయ్‌లో జరిగిన వేలంలో రూ.6.8 కోట్లకు సొంతం చేసుకుంది. అతడితో పాటు ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ను కూడా భారీ ధరతో ఆరెంజ్ ఆర్మీ దక్కించుకుంది. ఈ ఇద్దరూ హైదరాబాద్ రాత మారుస్తారని ఎస్ఆర్‌హెచ్ యాజమాన్యం భావిస్తోంది. 2016లో చాంపియన్‌గా నిలిచిన హైదరాబాద్ ఆ తర్వాత నిరాశపరిచింది. 16వ సీజన్‌లో అయితే.. మరీ దారుణమైన ఆటతో అట్టడుగున నిలిచింది. దాంతో, బ్రియాన్ లారాపై వేటు వేసి కోచ్‌గా సక్సెస్ అయిన వెటోరీకి హెడ్‌కోచ్





బాధ్యతలు అప్పగించింది. కొత్త కోచ్, కొత్త కెప్టెన్ ఆధ్వర్యంలో కప్పు కొట్టాలని హైదరాబాద్ జట్టు పట్టుదలతో ఉంది. 17వ సీజన్ తొలి మ్యాచ్‌లో కమిన్స్ సేన మార్చి 23న కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది.

# యశ్‌కు జోడీగా కరీనాకపూర్?



'కేజీఎఫ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత కన్నడ స్టార్ హీరో యష్ చేస్తున్న చిత్రం 'టాక్సిక్' యాశ్ 19గా తెరకెక్కనున్న ఈ సినిమాకు జాతీయ అవార్డు గ్రహీత గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీన్ఎన్ ప్రొడక్షన్స్ నిర్మిస్తుంది. ప్రస్తుతం ప్రీ ప్రోడక్షన్ పనుల్లో బిజీగా ఉన్న ఈ చిత్రం త్వరలోనే షూటింగ్ ప్రారంభించనుంది. అయితే ఈ మూవీలో హీరోయిన్‌గా ఎవరు నటిస్తున్నారు అనే విషయంపై ఇంకా క్లారిటీ రాలేదు. మొదట ఈ మూవీలో యశ్‌కు జోడీగా సాయిపల్లవి నటించనున్నట్లు టాక్ నడిచింది. ఆ తర్వాత ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ నటి కరీనాకపూర్ ఎంపికైనట్లు వార్తలు వస్తున్నాయి. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గోన్న కరీనా తన తదుపరి ప్రాజెక్ట్ గురించి ఆసక్తికర విషయాలను పంచుకుంది. బాలీవుడ్ భామలు టబు, కరీనా కపూర్ ఖాన్ కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రూ'. . ఈ సినిమా మార్చి 29 ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా కరీనా మాట్లాడుతూ.. నేను త్వరలో ఓ భారీ ప్రాజెక్టుతో దక్షిణాది చిత్రసీమలోకి అడుగుపెట్ట బోతున్నా. అది పాన్ ఇండియా ప్రాజెక్టు. నేను ఎక్కడ షూటింగ్ చేస్తానో నాకు ఇంకా తెలియదు. మొదటిసారి ఇలాంటి సినిమాలో పనిచేస్తున్నాను' అని చెప్పుకోచ్చారు. దీంతో కరీనా నటించేది యష్ మూవీనే అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

# మెగాఫోన్ పట్టనున్న కోలీవుడ్ హీరో విశాల్



తమిళ హీరో విశాల్ అనగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తుకొచ్చేది యాక్షన్ చిత్రాలే. కోలీవుడ్‌తో పాటు టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక ఇమేజ్ సంపాదించుకున్నాడు. ఇక విశాల్ నుంచి రాబోతున్న తదుపరి పూర్తి యాక్షన్ చిత్రం 'రత్నం'. హరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని జీ స్టూడియోస్, స్టోన్ బెంచ్ ఫిల్మ్స్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి. కార్తికేయన్ సంతానం నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. అయితే ఈ సినిమా అనంతరం దర్శకత్వ బాధ్యతలు చేపట్టనున్నాడు విశాల్. కోలీవుడ్ దర్శకుడు మిస్కిన్ దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'డిటెక్టివ్'. ఈ సినిమా తమిళంతో పాటు తెలుగులో మంచి హిట్ అందుకుంది. అయితే ఈ చిత్రానికి సీక్వెల్ రానుండగా.. 'డిటెక్టివ్ 2' దర్శకుడిగా మారారు విశాల్ ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ప్రత్యేక పోస్ట్ పెట్టాడు. 25 ఏండ్ల తర్వాత ఎట్టకేలకు నేను అనుకున్న ప్రయాణం మొదలైంది. నా కల, నా ఆకాంక్ష, నా మొదటి ఆలోచన ఎట్టకేలకు నా జీవితంలో నిజం కాబోతోంది. అవును, నా కెరీర్‌లో అత్యంత సవాలుతో కూడిన కొత్త బాధ్యతను తీసుకోబోతున్నా. దర్శకుడిగా పరిచయమవడం అన్నది నా కెరీర్‌లో అత్యంత సవాల్‌తో కూడుకున్నది. నా డైరెక్షన్‌లో వస్తున్నా తొలి చిత్రం కోసం లండన్ బయలుదేరాం. అజర్‌బైజాన్, మాల్టాల్లో షూటింగ్ చేయబోతున్నాం. దీన్ని వర్ణించడానికి మాటలు రావడం లేదు. మనం పడిన కష్టం ఎప్పుడూ వృథా కాదు అంటూ నా తండ్రి జీకే రెడ్డి, యాక్షన్ కింగ్ అర్జున్ సర్ చెప్పిన మాటలు ఎప్పుడూ మర్చిపోను. ఏది ఏమైనా, ఫలితం ఎలా వచ్చిన కలలు కనడం, వాటిని నిజం చేసుకోవడానికి ప్రయత్నించడం మానొద్దు. నటుడిగా నాకు ఈ గుర్తింపు ఇచ్చినందుకు మీ అందరికీ ధన్యవాదాలు. నా కల ఇంత త్వరగా సాకారం కావడానికి కారణమైన మిస్కిన్ సర్‌కు ప్రత్యేకంగా ధన్యవాదాలు. అంటూ విశాల్ ట్వీట్ చేశారు.



# 'కార్తికేయ 3'పై అప్‌డేట్ ఇచ్చిన నిఖిల్

2022లో వచ్చిన 'కార్తికేయ 2' సినిమాతో పాన్ ఇండియా లెవెల్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ చందు మొండేటి దర్శకత్వం వహించిన ఈ చిత్రం దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ సూపర్‌హిట్ అందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద రూ.100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమా వచ్చిన రెండు ఏండ్ల తర్వాత నిఖిల్, చందుల కాంబో రిపీట్ కాబోతుంది. తాజాగా కార్తికేయ 3కు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. ఈ ప్రాజెక్ట్‌పై నిఖిల్ సిద్దార్థ ఎక్స్ వేదికగా ప్రకటిస్తూ.. సరికొత్త సాహసాన్ని వెతికే పనిలో డాక్టర్ కార్తికేయ నిమగ్నమయ్యారు. త్వరలో రానున్నాం అంటూ నిఖిల్ రాసుకోచ్చాడు. ఇక ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రోడక్షన్ పనులు జరుగుతుండగా.. 'కార్తికేయ 2'తో పోలిస్తే ఇది భారీ బడ్జెట్‌తో రూపొందించనున్నట్లు టాక్. నిఖిల్ మరోవైపు పాన్ ఇండియా చిత్రం స్వయంభు చేస్తున్నాడు. ఈ సినిమాకు భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తుండగా.. మలయాళ భామ సంయుక్తామీనన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇక హిస్టారికల్ బ్యాక్‌డ్రాప్‌లో రానున్న ఈ సినిమాలో నిఖిల్? ఓ యోధుడి? పాత్రలో కనిపించనున్నారు.

# త్రిష కోసమే ఆ సినిమా చూశా...



'జాతిరత్నాలు'లో 'చిట్టి'ని ఇప్పుడప్పుడే ఎవరూ మర్చిపోలేరు. ఆ పాత్రకు ఇటీవలే ఉత్తమనటిగా 'గామా' అవార్డు కూడా అందుకున్న ఫరియా అబ్దులా స్పెషల్ సాంగ్‌లోనూ తళుక్కుమంది. తాజాగా 'ఆ... ఒక్కటీ అడక్కు' చిత్రంతో అల్లరి నరేష్‌తో కలిసి గిలిగింతలు పెట్టడానికి సిద్ధమైంది. ఈ సందర్భంగా ఈ హైదరాబాదీ భామ పంచుకున్న ముచ్చట్లివి...

'జాతిరత్నాలు' విడుదలైన తర్వాత తమాషా సంఘటన ఎదురైంది. ఒకసారి నేను క్యాబ్‌లో వెళ్తున్నా. డ్రైవర్ కాస్త డల్‌గా ఉండటంతో ఏమైందని అడిగా. తన చిన్నప్పటి క్రష్ పేరు చిట్టి అని, తను గుర్తొచ్చిందని చెప్పాడు. తన బాధను పోగొట్టాలని సరదాగా నా పేరు కూడా చిట్టి అని చెప్పా. ఇంకేముంది ఆయన క్రష్, నేను ఒకరే అనుకొని వెంటనే కారు ఆపేసి 'మీ స్కూల్ పేరు ఏంట'ని అడిగేశాడు. దాంతో నా అసలు పేరు చెప్పి, 'జాతిరత్నాలు' సినిమాలో నా పాత్ర పేరు చిట్టి అని చెప్పడంతో డ్రైవర్ నవ్వేశాడు. చిన్నప్పుడు నేను చాలా నాటీ. ఓసారి స్నేహితులందరం కలిసి సూపర్ మార్కెట్‌కు వెళ్లి చిప్స్ ప్యాకెట్స్, చాక్లెట్స్ తీసుకొని ఎవరి కంటపడకుండా బ్యాగ్‌లో పెట్టుకొని వచ్చేద్దామని ప్లాన్ వేసుకున్నాం. అనుకున్నట్టుగానే నేను చాక్లెట్స్ తీసుకుని గబగబా వచ్చేశాను. కానీ నా ఫ్రెండ్స్ మాత్రం పాపం అడ్డంగా దొరికిపోయారు. ఆ సంఘటన ఇప్పటికీ గుర్తు చేసుకొని మరీ నవ్వుకుంటాం. నాకు ప్రయాణాలంటే చాలా ఇష్టం. ఎక్కడికైనా సోలోగా వెళ్లడానికే ఇష్టపడతా. ఇతర ప్రాంతాల్లోని సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకోవడమంటే ఆసక్తి. ఇప్పటికే మన దేశంలోని ముఖ్యమైన ప్రదేశాలన్నీ చుట్టొచ్చేశా. కానీ మొదటి విదేశీ ప్రయాణం మాత్రం 'లైక్ షేర్ అండ్ సబ్‌స్క్రయిబ్' సినిమా వల్లే జరిగింది. థాయిలాండ్‌లో చేసిన పాట చిత్రీకరణ నాకు మర్చిపోలేని అనుభూతిని ఇచ్చింది. చిన్నప్పటి నుంచి హిందీ సినిమాలు చూస్తూ పెరిగాను. తెలుగులో నేను చూసిన మొదటి సినిమా 'వర్షం'. అందులో త్రిష నటన చూసి ఆమెకు ఫ్యాన్ అయిపోయా. ఆ తర్వాత త్రిష కోసమే 'నువ్వొస్తానంటే నేనొద్దంటానా!' సినిమా చూశా. అది కూడా నాకు భలే నచ్చింది. ఎంతలా అంటే ఆ సినిమా ఎన్నిసార్లు చూశానో కూడా లెక్కలేదు. నేను చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తా. నటిగా నా జర్నీపై నాకో స్పష్టత ఉంది. ఛాన్స్‌లు వస్తాయా, రావా అనే భయం కూడా లేదు. అలాగే నాకు ప్రయోగాలు చేయడంటే ఇష్టం.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com